హైకోర్టులో ఏం జరుగుతుందో..?

ఆర్‌ఎస్‌కే సిబ్బంది బదిలీల్లో అక్రమాలపై నేడు విచారణ
ర్యాంక్ ఉన్నా అన్యాయం చేశారని కోర్టుకు వెళ్లిన 11మంది
స్టేటస్‌కో జారీ చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు



బదిలీల్లో జరిగిన అన్యాయంపై అర్జీ ఇచ్చేందుకు అనంత కలెక్టరేట్‌కు వచ్చిన శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన అగ్రికల్చర్ అసిస్టెంట్లు (ఫైల్)

అనంతపురం అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని ఉమ్మడి జిల్లాకు చెందిన రైతు సేవాకేంద్రం సిబ్బంది వేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరగనుంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి రైతు సేవా కేంద్రంలో పనిచేసే చేసే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు గత నెల 28న అనంత జేడీఏ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలుత సీనియార్టీ మేరకు మొదలుపెట్టారు. దీంతో ర్యాంక్ వారిగా కౌన్సెలింగ్ నిర్వహించాలని సిబ్బంది పట్టుబట్టడంతో మూడు గంటల తర్వాత ర్యాంక్ వారిగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా మంచి ర్యాంక్ ఉన్న సిబ్బందికి అన్యాయం జరిగిందనే ఆరోపణలు వినిపించారు. ఈ నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 11 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు పలు మార్లు జిల్లా కలెక్టర్, జేడీఏలను కలిసి విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో బాధిత సిబ్బంది న్యాయ పోరాటానికి దిగారు. ఈనెల 14న తమకు మంచి ర్యాంక్‌లున్నా తాము అడిగిన మూడు ఆప్షన్లలో ఏ ఒక్క స్థానం ఇవ్వకుండా అన్యాయం చేశారంటూ 11 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారు. ప్రస్తుతం సిబ్బంది పనిచేస్తున్న స్థానాల్లోనే రెండు వారాలపాటు కొనసాగించాలంటూ ఈనెల 15న హైకోర్టు (మిగతా 7లో..)



ఏదైనా కబ్జానే..!

అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మండలంలోని కొలేపల్లి వద్ద ఉన్న చెరువును కొందరు ఆక్రమించారు. దాదాపు 250 ఎకరాల్లో ఈ చెరువు విస్తరించి ఉంది. చెరువును ఆనుకుని కొన్ని గ్రామాలతో పాటు, కూతవేటు దూరంలో జాతీయ రహదారి కూడా ఉంది. ఇక్కడ ఎకరం భూమి ధర రూ. కోటికిపైనే ఉంది. ఈ నేపథ్యంలో ఈచెరువుపై వైసీపీ నాయకుల కన్ను పండింది. దీంతో చెరువును ఆనుకుని కొంతభూమిని కొనుగోలు చేసి, చెరువు స్థలాన్ని కబ్జా చేశారు. వాహనాలతో మట్టి తోలించి, చదును చేస్తున్నారు.

అక్రమార్కుల చెరలో దేవరచెరువు
రూ.కోట్ల భూమి కజ్జాకు యత్నం
కుంచించుకుపోయిన 18 అడుగుల కాలువ

చెరువులు, కాలువలనూ వదలని వైనం

కదిరి అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన బఫర్ జోన్‌లను సైతం అక్రమార్కులు ఆక్రమించేస్తున్నారు. భూమి కోతను నివారించి, సహజ వాతావరణాన్ని పరిరక్షించడానికి చెరువుల చుట్టు దాదాపు 30 మీటర్ల వరకు బఫర్‌జోన్ ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఎత్తు పెంచకూడదు. బఫర్ జోన్ పరిధిలో సొంత భూమి ఉన్నా సరే అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఆభూమిలో సాగు మాత్రమే చేసుకోవచ్చు. ఇలాంటి చోట వైసీపీ నాయకులు పక్కనే ఉన్న భూమిని తక్కువధరకే కొనుగోలు చేసి, బఫర్ జోన్‌ను కబ్జా చేసి, మట్టితో చదును చేస్తున్నారు. ఆ భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించడానికి పన్నాగం పన్నుతున్న ట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాలువ సైతం కబ్జా

మండలంలోని ముత్యాలచెరువు పొలంలో వరిగిరెడ్డిపల్లికి వెళ్లే కాలువను సైతం కొంతమంది రియల్టర్లు కబ్జా చేశారు. వరిగిరెడ్డిపల్లి వద్ద ఉన్న అయ్యవారికుంటకు పైప్రాంతం నుంచి వర్షపునీరు చెక్ డ్యామ్‌లద్వారా చేరుతుంది. దాదాపు 18 అడుగుల వెడల్పు ఉన్న ఈకాలువ కుంచించుకుపోయి నాలుగు అడుగులకు చేరింది. అధికారులు స్పందించి కాలువను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కుంచించుకుపోయిన అయ్యవారికుంట కాలువ

చెరువులను పరిరక్షిస్తాం

కొన్నిచోట్ల చెరువులు, కాలువలు ఆక్రమణలకు గురైనట్లు మా దృష్టికి వచ్చింది. దేవరచెరువులోని బఫర్‌జోన్‌లో కొంతమంది మట్టిని తోలారని కూడా తెలిసింది. దీంతో రెవెన్యూ అధికారులతో కలిసి ఆప్రాంతాన్ని పరిశీలించా. బఫర్‌జోన్‌లో మట్టితోలిన వారిని గుర్తించి నోటీసులు పంపాం.

- మహేష్, ఏఈ, మైనర్ ఇరిగేషన్, కదిరి

ఉపేక్షించేది లేదు

చెరువులను అక్రమిస్తే ఎవరినైనా ఉపేక్షించేదిలేదు. చెరువులను కబ్జా చేసినట్లు ఫిర్యాదు చేస్తే, పూర్తిస్థాయిలో విచారణ జరిపి, చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. చెరువుల చుట్టూ కంచెను ఏర్పాటు చేసి, బోర్డులు పెడతాం. ఆక్రమించివారికి నోటీసులిచ్చి, కేసు సైతం నమోదు చేస్తాం. **- మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి**



కసాపురం వద్దకు చేరిన కృష్ణా జలాలు

స్వాగతం కృష్ణమ్మా..!

జిల్లాలోకి ప్రవేశించిన హంద్రీనీవా నీరు

- జలహారతి ఇచ్చిన ఎమ్మెల్యే గుమ్మనూరు
- 3,850 క్యూసెక్కుల ప్రవాహమే టార్గెట్
- ఈ ఏడాది 40 టీఎంసీలు దాటే అవకాశం
- వారం తరువాతే సాగుకు విడుదల

గుంతకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాలో ఎత్తిపోతలు మొదలయ్యాక ఐదు రోజులకు.. మంగళవారం ఉదయం కృష్ణా జలాలు జిల్లాకు చేరాయి. మల్యాల పంప్‌హౌస్ వద్ద ఈ నెల 17న సీఎం చంద్రబాబు ఎత్తిపోతలను ప్రారంభించారు. కాలువ విస్తరణ పనులు పూర్తయ్యాక తొలిసారి నీరు పారుతోంది. ఈ కారణంగా తక్కువ మోతాదులో నీటిని ఎత్తిపోస్తున్నారు. కర్నూలు జిల్లా మద్దికెరను దాటుకుని బుగ్గసంగాల వద్ద కృష్ణా జలాలు జిల్లాలోకి ప్రవేశించాయి. త్వరలో మరిన్ని పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసి, లక్ష్యాన్ని సాధించాలని జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులు కృత నిశ్చయంతో ఉన్నారు.

3,850 క్యూసెక్కులే టార్గెట్

హంద్రీనీవా కాలువ సామర్థ్యానికి అనుగుణంగా మొదటి పంప్ హౌస్ వద్ద గరిష్ఠంగా 3,850 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి దశలో మల్యాల పంప్ హౌస్ వద్ద ప్రస్తుతం 4 పంపులను రన్ చేస్తున్నారు. జిల్లాకు సమీపంలో, కర్నూలు జిల్లాలో ఉన్న గుండ్లకొండ 7వ నంబరు పంప్‌హౌస్‌లో 2 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. దీంతో జిల్లాలోకి ప్రస్తుతం 320 క్యూసెక్కుల నీరు ప్రవేశించింది. రాగులపాడు వద్ద 8వ పంప్ హౌస్‌కు మంగళవారం అర్ధరాత్రికి నీరు చేరుకుంటుంది. అక్కడి నుంచి జీడిపల్లి రిజర్వాయరు వైపు నీటిని ఎత్తిపోస్తారు. కాలువ గట్ల పరిస్థితిని అంచనా వేయడానికి తక్కువ మోతాదులో నీటిని పారిస్తున్నారు. విడతలవారీగా పంపుల సంఖ్యను పెంచుతూపోతారు. పదిహేను రోజుల్లోగా జీడిపల్లి వద్ద అన్ని పంపులనూ రన్‌చేసి, లక్ష్యానికి అనుగుణంగా 3,850 క్యూసెక్కుల నీటిని కాలువలో పారిస్తామని హంద్రీనీవా గుంతకల్లు ఏరియా కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస నాయక్ తెలిపారు.

40 టీఎంసీలు దాటేలా..

హంద్రీనీవాలో 40 టీఎంసీల వరద నీటిని ఎత్తిపోయాలన్న లక్ష్యంతో కాలువను డిజైన్ చేశారు. ఎత్తిపోతలు ప్రారంభమయ్యాక మ్యాజిక్ ఫిగర్ 40 టీఎంసీలు టీడీపీ హయాంలో ఒకసారి, 2020-21 సీజన్‌లో ఒకసారి సాధ్యమైంది. వైసీపీ హయాంలో మిగతా నాలుగు సీజన్‌లలో సాగునీటి పారుదల అత్యంత దయనీయంగా జరిగింది. ప్రస్తుతం హంద్రీనీవా వైడెనింగ్ పూర్తయినందున ఈ సంవత్సరం 40 టీఎంసీలకు మించి సాగునీటిని కాలువలో పారించాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉంది. ఈ సంవత్సరం అత్యధిక రోజులపాటు కాలువలో నీటిని పారిస్తే.. 40 టీఎంసీల (మిగతా 6లో..)

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వందశాతం అక్షరాస్యతే లక్ష్యంగా విద్య అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండో విడత ఉల్లాస్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యం అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 15,954 మంది వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడంలో విజయవంతమయ్యామని అన్నారు. 1595 మంది స్వచ్ఛంద ఉపాధ్యాయుల సహకారంతో ఈ విజయం సాధించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్షరాంధ్ర అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. దీని ద్వారా 2029 నాటికి రాష్ట్రంలోని మొత్తం వయోజనులను వందశాతం అక్షరాస్యులుగా తీరిదిద్దడమే లక్ష్యం అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, డ్వామా, జిల్లా ప్రణాళిక శాఖ, మెప్మా సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వయోజవిద్యాశాఖ డీడీ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఈఓ క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పర్యాటక కేంద్రంగా పెనుకొండ

టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్

6

నకిలీలతో రైతన్నకు మోసం..!

- తక్కువ ధరకే క్రిమిసంహారక మందులు
- నిలువునా ముంచుతున్నా పట్టించుకోని అధికారులు
- కొరవడిన పర్యవేక్షణ



6

అలరించిన సాయిస్వర గీతాంజలి

పుట్టపర్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): విదేశీ భక్తులు సాయి స్వర గీతాంజలి పేరిట సంగీత కచేరితో భక్తులను అలరింపచేశారు. రెండోరోజు మంగళవారం సాయంత్రం సాయి కుల్వంతు సభామండపంలో సత్యసాయి గ్లోబల్‌కౌన్సిల్ జోన్-8 పరిధిలోని తూర్పు, మధ్య దేశాల భక్తులు సంగీత గానాన్ని నిర్వహించారు. గంట పాటు మధుర వాయిద్య గానంతో భక్తులను అలరింపచేశారు. అనంతరం సత్య సాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో 500 మంది విదేశీభక్తులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న విదేశీ భక్తులు



సత్యసాయి శత జయంతిని

ఘనంగా నిర్వహించాలి

అక్టోబరు 15నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలి
ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్



హారతి ఘాట్‌ను పరిశీలిస్తున్న అధికారులు, ఎమ్మెల్యే

పుట్టపర్తి టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ అధికారులను ఆదేశించారు. నవంబరులో జరిగే సత్యసాయి శతజయంతి వేడుకల నిర్వాహణ, ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ వి.రత్న, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఆయన పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సత్యసాయి జన్మదినాన్ని ప్రభుత్వ పండుగగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని, వేడుకలలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని అన్నారు. అక్టోబరు 15నాటికి శత జయంతి ఏర్పాట్లును పూర్తి చేయాలని ఆదేశించారు. ఉత్సవాల సమయంలో రోజుకు పదివేల మంది, ముఖ్యమైన రోజుల్లో గరిష్ఠంగా 70 వేల మంది భక్తులు పుట్టపర్తికి వచ్చే అవకాశం ఉందని అన్నారు. రద్దీకి అనుగుణంగా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు, ఫుడ్ కౌంటర్ల ఏర్పాటు విషయంలో రాజీ పడవద్దని అన్నారు. బాబా శత జయంతికి ఏర్పాట్లు ప్రారంభించామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను విజయవంతం చేస్తామని అన్నారు. పుట్టపర్తికి వచ్చే వీఐపీల భద్రతకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ రత్న తెలిపారు. అత్యవసర వాహనాలు, సీసీ కెమెరాలు, డాగ్ స్క్వాడ్, కమ్యూనికేషన్ కేంద్రాలు, క్విక్ రియాక్షన్ టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రభుత్వం సత్యసాయి శతజయంతిని రాష్ట్ర పండుగగా నిర్ణయించడం సంతోషకరమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. పుట్టపర్తి పట్టణ సుందీరకణ, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.105 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్‌ను ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. జయంతి వేడుకలకు విస్తృత్త ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని అన్నారు. అంతకు ముందు బాబా శత జయంతి వేడుకల నిర్వాహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లపై జేసీ అభిషేక్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం వారు పుట్టపర్తిలోని శిల్పారామం, విమానాశ్రయం, చిత్రావతి రోడ్డు, హారతి ఘాట్‌ను పరిశీలించారు.

కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడో..?

56,291 జిల్లాలో దరఖాస్తులు

- వైసీపీ హయాంలో కోత
- ఏటీఎం మాదిరి రైస్‌కార్డులు

రేషన్ కార్డు



ఉన్న కార్డును రద్దు చేశారు



రెండేళ్ల క్రితం రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. గతంలో రేషన్‌కార్డు ఉండేది. అంతకు ముందు ఉన్న రేషన్ కార్డును సాంకేతిక సమస్యల కారణంగా రద్దు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో రేషన్ కార్డు కోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్నా ఇంత వరకు రాలేదు. దీంతో ప్రభుత్వ పథకాలు రావడంలేదు. వెంటనే బియ్యం కార్డు మంజూరు చేయాలని కోరుతున్నా.

- లక్ష్మీనరసింహులు, ఏకపపాదంపల్లి, తాడిమర్రి మండలం

ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త రేషన్ కార్డుల మంజూరుకు అవకాశం ఇవ్వడంతో భారీగా దరఖాస్తు చేసుకున్నారు. వైసీపీ హయాంలో కొత్తకార్డుల జారీ లేకపోవడంతో వేలాది మంది పేదలు ఇబ్బంది పడ్డారు. రకరకాల కారణాలతో ఉన్న కార్డులను సైతం భారీగా ఏరివేశారు. ప్రస్తుత ప్రభుత్వం కార్డుల జారీకి నిర్ణయించడంతో ఇప్పటి వరకు 56,291 మంది దరఖాస్తు చేసుకున్నారు. కుటుంబంలో అదనపు సభ్యుల పేర్లు చేర్చాలంటూ 37,542 మంది వినతులు ఇచ్చారు. వైసీపీ పాలనలో రకరకాల నిబంధనల పేరుతో రేషన్‌కార్డులను భారీగా రద్దుచేశారు. ప్రభుత్వం (మిగతా 6లో...)

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇందిరమ్మ కాలనీలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన లక్ష్మీప్రసాద్ (39) కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మద్యానికి బానిసై పనులకు కూడా సరిగా వెళ్లేవాడు కాదు. ఇంటి ఖర్చులు, తాగుడుకు తెలిసిన వారు, బంధువులు వద్ద రూ.3లక్షల దాకా అప్పులుచేశాడు. ఆ అప్పులను ఎలా తీర్చాలో దిక్కుతోచక మనస్థాపానికి గురయ్యేవాడు. తాను చనిపోతానని కుటుంబ సభ్యులతో అనేవాడు. తండ్రి మస్తానప్ప, భార్య కుసుమ ధైర్యం చెప్పేవారు. మూడురోజుల క్రితం మృతుడి భార్య అనంతపురం వెళ్లింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి లక్ష్మీప్రసాద్ ఇనుపతీరుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి మస్తానప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కుసుమతో పాటు పదో తరగతి చదువుతున్న కుమార్తె మన్విత ఉన్నారు.



లక్ష్మీప్రసాద్ (ఫైల్)

మేమింతే.. అనుకున్నది చేస్తాం..!

- కమిషనర్ వద్దంటున్నా అక్రమ డెప్యుటేషన్లు
- ఎస్‌ఎస్‌ఏకు నలుగురు టీచర్లు..
- డీపీసీ, ఏపీసీ నిర్ణయాలపై టీచర్ల విస్మయం

6

మనోభావాలను దెబ్బతీయొద్దు

- జేసీపీఆర్ అనుచిత వ్యాఖ్యలు అభ్యంతరకరం
- ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కమిటీ

7

శ్రావణంలో అంజన్న దర్శనం శ్రేష్టం

- 25 నుంచి నేమకల్లులో ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



నేమకల్లు గాలి గోపురం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు



నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సకల శుభాల శ్రావణ మాసం ఈ నెల 25న ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా నేమకల్లులో వెలసిన ప్రముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ ఉత్సవాలు నిర్వహించేందుకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మాసంలో ప్రతి శని, మంగళవారాల్లో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. కసాపురం, నేమకల్లు, మురిడి ఆంజనేయస్వామిని శ్రావణంలో శనివారం, మంగళవారం ఏదో ఒకరోజు దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కోసం ఎస్ఐ నబీ రసూల్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. శ్రావణ మాసంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు అనిల్‌కుమార్‌చార్యులు తెలిపారు. ప్రతి శని, మంగళవారాల్లో సాయంత్రం పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ మాసంలో స్వామిని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని అన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో నరసింహారెడ్డి తెలిపారు. తాగునీరు, స్నానాలకు నీటిసౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని ఈవో చెప్పారు.

పర్యాటక కేంద్రంగా పెనుకొండ

ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్



గగన్‌మహల్‌ను చూసి వస్తున్న అజయ్‌జైన్, కలెక్టర్ చేతన్

పెనుకొండ/లేపాక్షి, జూలై 22(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్యం రెండో రాజధానిగా వెలుగొందిన పెనుకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ టూరిజం కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ పేర్కొన్నారు. పెనుకొండలోని శ్రీకృష్ణ దేవరాయల వేసవి విడిదిగా పేరుగాంచిన గగన్‌మహల్ రాజసౌధాన్ని జిల్లా కలెక్టర్ చేతన్‌తో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. పెనుకొండకు వచ్చిన వీరికి ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ స్వాతి, ఇతరశాఖల అధికారులు పుష్ప గుచ్ఛాన్ని అందించి ఘనస్వాగతం పలికారు. చరిత్రకారుడు మైనా స్వామి, పురావస్తుశాఖ అధికారి స్వామినాయక్ పెనుకొండ చరిత్ర విశేషాలు, ప్రాచీన కట్టడాల విశేషాల గురించి అజయ్‌జైన్‌కు వివరించారు. గగన్‌మహల్‌ను డెస్టినేషన్ వెడ్డింగ్ ప్లేస్ (వివాహవేడుకల వేదిక)గా మార్చాలని కోరారు. అనంతరం వారు లేపాక్షికి బయల్దేరి వెళ్లారు.

శిల్పకళ అద్భుతం

లేపాక్షి దుర్గా వీరభద్రస్వాముల ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని ఏపీ టూరిజం కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ అన్నారు. జిల్లా కలెక్టర్ చేతన్‌తో కలిసి మంగళవారం ఆయన ఆలయానికి విచ్చేశారు. ఆలయ గైడ్ విరూపణ్ణ ఆలయ చరిత్రను వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో శిల్పాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. దుర్గా, వీరభద్రస్వాములకు అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వీరి వెంట తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, టూరిజం మేనేజర్ ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

మారిన తరవాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో మే 14 నుంచి జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డులకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొత్తగా వివాహమైన వారు, ఇప్పటి వరకు రేషన్‌కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైన వారు.. ఇలా ఏడు రకాల సేవలకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో కొత్త కార్డుల కోసం 56,291, మార్పులు, చేర్పుల కోసం 37,542 దరఖాస్తులు వచ్చాయి. కొత్త కార్డులు మంజూరు కాకపోవడంతో దరఖాస్తు దారులు ఎప్పుడు వస్తాయోనని నిరీక్షిస్తున్నారు.

ఇక డిజిటల్ కార్డులు

ప్రస్తుతం రేషన్‌కార్డుల్లోనూ మార్పులు చేయనున్నారు. త్వరలో ఇవ్వనున్న కొత్త రేషన్‌కార్డులను రైస్ కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. వీటిని పూర్తిగా ఏటీఎం కార్డు తరహాలో డిజైన్ చేశారు. వీటికి క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తరువాత డీలర్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తమ అభిప్రాయాలను కూడా తెలపవచ్చు.

ఆదేశాలు రాగానే కొత్త కార్డులు



కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లాలో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని పరిశీలించి జాబితాను తయారుచేసి పంపాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొత్త రేషన్‌కార్డులను అందజేస్తాం. ఏటీఎంలాగా ఉన్న కార్డులను లబ్ధిదారులకు ఇస్తాం.

\- వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓ

మూడేళ్లుగా ఎదురుచూస్తున్నా



నాకు వివాహమై ఆరేళ్లవుతోంది. ప్రభుత్వ పథకాలు పొందాలంటే రేషన్‌కార్డు అడుగుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మూడేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. దీంతో ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నా. నా కుమార్తె ఒకటో తరగతి చదువుతోంది. ప్రభుత్వ పథకాలు రావాలంటే బియ్యంకార్డు అవసరం. ఈ ప్రభుత్వమైనా బియ్యం కార్డు మంజూరు చేయాలని కోరుతున్నా.

\- రఘు, బసవన్నకట్ట వీధి, కొత్తచెరువు

పీఎస్ హెచ్‌ఎం నరసింహులు సస్పెన్షన్

అనంతపురం విద్య, జూలై 22(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలం పాతకల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరసింహులును సస్పెండ్ చేస్తూ డీఈఓ ప్రసాద్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వారం రోజుల క్రితం ఆ మండల ఎంఈఓలు వెంకటరమణనాయక్, చంద్రానాయక్ కలిసి నరసింహులు పనిచేస్తున్న పాఠశాలకు వెళ్లారు. రికార్డులు, పనితీరు సరిగా లేవని షోకాజ్ నోటీసు ఇవ్వడానికి ఎంఈఓలు నిర్ణయం తీసుకున్నారు. ఇంతకు ముందే ఎంఈఓలు పీఎస్ హెచ్‌ఎం మధ్య మనస్పర్థలు ఉండడంతో మళ్లీ గొడవకు దిగారు. నరసింహులు, ఆయన కుమారుడు ఎంఈఓలతో వాగ్వాదం చేసుకుంటూ వారి ఫోన్లు లాక్కొని నేలకేసి పగులకొట్టారు. దీనిపై ఎంఈఓలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే విధంగా జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పీఎస్ హెచ్‌ఎం నరసింహులును సస్పెండ్ చేశామని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు.



స్వామికి సమర్పించిన షంషీర్



స్వామికి చక్కెర చదివిస్తున్న భక్తులు

ఘనంగా షంషీర్

వేకువజామున ఊరేగింపు
మస్తాన్‌వలి ఉరుసుకు పోటెత్తిన భక్తులు

గుంతకల్లుటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతగుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్ వలి 390వ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం మస్తాన్ వలి షంషీర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. షంషీర్‌ను తిలకించడానికి భక్తులు పోటెత్తారు. దర్గా నుంచి ఊరువాకిలి వరకు భక్తులతో కిక్కిరిసింది. పాతగుంతకల్లులోని ఊరువాకిలిలో నివాసముంటున్న రెడ్డి కులస్థుల ఇంటి నుంచి వేకువజామున స్వామి షంషీర్ ఊరేగింపును ప్రారంభించారు. మేళతాళాలు, యువకుల కేరింతల నడుమ, దివిటీల మధ్య షంషీర్‌ను ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. పాతగుంతకల్లులోని శివాలయం వద్ద ఉన్న బావిలో నుంచి భక్తులు బిందెలతో నీటిని తీసుకుని అశ్వం పాదాలకు పోసి మొక్కులు తీర్చుకున్నారు. షంషీర్‌ను స్వామికి సమర్పించి, ముజావార్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు ఎండు కొబ్బరిని దివిటీలలో కాల్చి ప్రసాదంగా తీసుకెళ్లారు. స్వామికి చాదర్, పూల హారాలు, చక్కెర సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐ ఏపీ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ రహీంహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

చాదర్ సమర్పించిన ఎమ్మెల్యే

పాతగుంతకల్లులోని హజరత్ సయ్యద్ మస్తాన్ వలి దర్గాలో ఉరుసు ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్వామికి చాదర్ సమర్పించారు. దర్గాలో ఎమ్మెల్యేకు టీడీపీ మైనార్టీ నాయకులు స్వాగతం పలికారు. ముజావర్లు ఫాతేహాలు చదివి ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు రామన్న చౌదరి, ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, మస్తాన్, ఫజులు, ఖాజా, సలీం, షంషుద్దీన్ పాల్గొన్నారు.

స్వాగతం కృష్ణమ్మా..!

(5వ పేజీ తరువాయి)

కంటే అధికంగా ఎత్తిపోతలు సాధ్యపడతాయని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

ఎత్తిపోతల్లో రికార్డు

హంద్రీనీవాకు సాగునీటి ఎత్తిపోతలు ప్రారంభించే అంశంలో ఈ సంవత్సరం ఓ రికార్డు నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జూలై 17కే ఎత్తిపోతలను ప్రారంభించారు. 2020-21 సీజన్‌లో జూలై 24న ఎత్తిపోతలు మొదలయ్యాయి. ఆ సీజన్‌లో గరిష్ఠంగా 266 రోజులపాటు హంద్రీనీవాలో నీరు పారింది. సుమారు 40 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. 2021-22 సీజన్‌లో జూలై 27వ తేదీ నుంచి 201 రోజులు, 2022-23 సీజన్‌లో జూలై 24వ తేదీ నుంచి 237 రోజులు, 2023-24లో ఆగస్టు 21వ తేదీ నుంచి 207 రోజులు, 2024-25 సీజన్‌లో ఆగస్టు 13వ తేదీ నుంచి 212 రోజులపాటు నీరు లభించింది. ఈ సంవత్సరం ఇంకాస్త ముందే పంపింగ్ ప్రారంభించాల్సి ఉన్నింది. శ్రీశైలం డ్యాంలో ఈ నెల తొలి వారంలోనే ఎత్తిపోతలకు తగినన్ని నీటి నిల్వలు ఉన్నా, హంద్రీనీవా విస్తరణ పనుల కోసం ఎత్తిపోతలను చేపట్టలేకపోయారు.



కాలువలో చనిపోయిన చేపలు

నీటిలో రసాయనాలు..?

హంద్రీనీవాకు కాస్త ముందుగానే నీరు వచ్చినా, సాగు భూములకు తడులను అందించడానికి కొంత సమయం తీసుకోనున్నారు. హంద్రీనీవా విస్తరణ ప్రక్రియలో రాళ్లను పగులగొట్టడానికి జిల్లాలో జీడిపల్లి వరకూ జిలెటిన్ స్టిక్స్‌ను వినియోగించారు. వెంటనే పొలాలకు నీటిని విడుదల చేస్తే పేలుడులో వినియోగించిన గంధకం, భాస్వరం కారణంగా భూములు పాడౌతాయని రైతులు భావిస్తున్నారు. దీన్ని రుజువు చేస్తూ హంద్రీనీవా ప్రవాహంలో వేలాదిగా చేపలు చనిపోయి కొట్టుకువస్తున్నాయి. సాధారణ సమయంలో ఆ పరిస్థితి కనిపించేది కాదు. రైతులు అనుమానించినట్లే నీరు కలుషితమై చేపలు చనిపోతున్నాయి. ఈ కారణంగా సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు నీటిని పంపింగ్ కూడా కొన్ని రోజులు వాయిదా వేసుకోవడమే మంచిదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నందున ప్రస్తుతానికి భూములకు తడులు ఇవ్వాల్సిన అవసరం లేదని రైతులు అంటున్నారు.

కార్యసాధకుడు చంద్రబాబు

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



కసాపురం వద్ద జల హారతి ఇస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి):హంద్రీనీవా విస్తరణ పనులను వంద రోజుల్లో పూర్తిచేసిన కార్యసాధకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కొనియాడారు. కృష్ణా జలాలు జిల్లాలోకి ప్రవేశించిన సందర్భంగా కసాపురం సమీపంలో ఆయన జల హారతి ఇచ్చారు. రాయలసీమలో హంద్రీనీవాకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించిన చంద్రబాబు, విస్తరణ పనులను చేపట్టి, సకాలంలో పూర్తిచేయించారని అన్నారు. ఐదేళ్లు అధికారాన్ని వెలగబెట్టిన జగన్.. ఊకదంపుడు ఉపన్యాసాలతో కాలాన్ని వృథా చేశారని అన్నారు. విస్తరణ పనులు పూర్తయినందున రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. హంద్రీనీవాలో రికార్డు స్థాయిలో నీరు పారుతుందని, నీటిని సక్రమంగా వినియోగించుకుని ఫలితాలు పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో హంద్రీనీవా ఈఈ శ్రీనివాస నాయక్, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, విజయలక్ష్మి, పూల రమణ తదితరులు పాల్గొన్నారు.

మేమింతే.. అనుకున్నది చేస్తాం..!

- కమిషనర్ వద్దంటున్నా అక్రమ డెప్యుటేషన్లు
- ఎస్ఎస్ఏకు నలుగురు టీచర్లు
- డీపీసీ, ఏపీసీ నిర్ణయాలపై టీచర్ల విస్మయం



Proceedings of the DEO & Ex-Officio Project Coordinator, APSS, Ananthapuramu

నలుగురిని ఎస్ఎస్ఏకు డెప్యుటేషన్ వేస్తూ డీఈఓ ఇచ్చిన ఉత్తర్వులు

అనంతపురం విద్య, జూలై 22(ఆంధ్రజ్యోతి): 'ఎవరో చెబితే వినాలా.. ఎవరికీ భయపడేదిలేదు.. మేమింతే, అనుకున్నది చేస్తాం' అనే భావనతో జిల్లా సమగ్రశిక్ష శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇందుకు వారిచ్చిన డెప్యుటేషన్ల ఉత్తర్వులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లా సమగ్రశిక్షలో దాదాపు ఏడాదిగా కీలకమైన సెక్టోరల్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలలకు కోట్లు నిధులు ఇస్తున్నారు. విద్యా పథకాల పర్యవేక్షణ పడకేసింది. విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయి. అలాంటపుడు సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి ఎస్ఎస్ఏ అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి వివాదం రావడంతో ఇద్దరిని మాత్రమే తీసుకున్నారు. ఇంకా ఆరు పోస్టులు అలాగే ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి మళ్లీ గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చారు. ఆరు పోస్టులకు 171 దరఖాస్తులు వచ్చాయి. 20 రోజులు దాటినా ఆ దరఖాస్తుల గురించి పట్టించుకోలేదు. పైగా కొంతమంది టీచర్లను డెప్యుటేషన్‌లో తీసుకోవడానికి చూస్తున్నారని తెలియడంతో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో రెండురోజుల క్రితం 'సమగ్రశిక్షలో చోద్యం, మళ్లీ డెప్యుటేషన్ల పేరుతో వివాదం' అనే కథనం ప్రచురితమయింది. డెప్యుటేషన్‌పై ఎవరినీ నియమించుకోరాదని కమిషనర్ విజయరామరాజు పదేపదే హెచ్చరిస్తున్నారు. అయినా వారు అనుకున్నట్లే నలుగురు టీచర్లను ఎస్ఎస్ఏకు డిప్యుటేషన్లు వేశారు. ఇందులో హెచ్‌ఎం ప్రహ్లాదనాయుడు, మోడల్ స్కూల్స్ హెచ్‌ఎంలు నారాయణస్వామి, చలపతినాయుడు ఎస్జీ టీచర్ ఆంజనేయులును డిప్యుటేషన్‌లో నియమించుకున్నారు. ఇందుకు డీఈఓ ప్రసాద్‌బాబు ఆమోదం కూడా వేశారు. ఏపీసీ అడిగారని, అక్కడి నుంచి వచ్చిన జాబితా మేరకే ఉత్తర్వులు ఇచ్చానని డీఈఓ అంటున్నారు. ఎస్ఎస్ఏలో జీసీడీఓగా కవిత, అసిస్టెంట్ ఏఎంఓగా ఫణికుమార్ పనిచేస్తున్నారు. ఇందులో కవితకు శాఖలో ఖాళీగా ఉన్న ఐఈడీ కోఆర్డినేటర్ బాధ్యతలను అప్పగించారు. ఫణికుమార్‌కు శాఖలో ఖాళీగా ఉన్న ఏఎంఓ, సీఎంఓ, అలెస్కో సెక్టోరియల్ పోస్టుల బాధ్యతలను అప్పగిస్తూ ఏపీసీ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నలుగురు టీచర్లను ఎందుకు ఆ శాఖకు డెప్యుటేషన్ వేసుకున్నారో అర్థంకావడంలేదు. ఇంకోవైపు నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులను తీసుకున్న ఎస్ఎస్ఏ అధికారులు నియామకాలు చేపట్టకుండా ఇలా ఎందుకు వ్యవహరిస్తున్నారో తెలియక టీచర్లు సతమతమవుతున్నారు.

నైపుణ్యాలతోనే నవ భారత్: ఎంపీ అంబికా



వార్షికోత్సవంలో ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): యువతలో నైపుణ్యాలను పెంచితే దేశం నవ భారత్ వైపు పయనిస్తుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఢిల్లీలోని భారత్ మండపంలో మంగళవారం నిర్వహించిన స్కిల్ ఇండియా మిషన్ 10వ వార్షికోత్సంలో ఆయన ప్రసంగించారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి జయంత్ చౌదరి, కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పదేళ్లుగా స్కిల్ ఇండియా మిషన్ లక్షలాది మందిలో నైపుణ్యాలను పెంచి ఉద్యోగావకాశాలు కల్పిస్తోందని ఎంపీ అన్నారు. ఇది భవిష్యత్తు భారతానికి పునాది వంటిదని అన్నారు. నైపుణ్యం ఉన్న యువత దేశ నిర్మాణానికి ముఖ్య ఆధారమని అన్నారు. యువతను శిక్షణతో శక్తివంతులుగా తీర్చిదిద్దే ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని ఎంపీ తెలిపారు.

నకిలీలతో రైతన్నకు మోసం..!

- తక్కువ ధరలకే క్రిమిసంహారక మందులు
- నిలువునా ముంచుతున్నా పట్టించుకోని అధికారులు
- కొరవడిన పర్యవేక్షణ



తనకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నకిలీ క్రిమి సంహారక మందులను సరఫరా చేస్తూ కొందరు ఎరువుల దుకాణదారులు రైతులను మోసగిస్తున్నారు. బయో పేరుతో ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయిస్తూ రైతును నిండా ముంచుతున్నారు. రసాయన ఎరువుల విక్రయాల్లో ఎమ్మార్పీకి విక్రయించాలంటూ సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు ఎరువుల దుకాణ యజమానులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తనిఖీల సమయంలో ఎరువులకు సంబంధించిన పీసీ (ప్రొడ్యూసర్ కంపెనీ)లు లేకపోతే వాటిని సీజ్ చేస్తున్నారు. దుకాణదారులు ఎరువులతోపాటు క్రిమిసంహారక మందులును కూడా విక్రయిస్తున్నాయి. 250 నుంచి 300 పైచిలుకు రకాల క్రిమిసంహారక మందులను విక్రయాలు కొనసాగిస్తున్నారు. వీటిలో కూడా పీసీలు ఉంటేనే విక్రయించాలన్న నిబంధనలున్నాయి. కొంతమంది ఎరువుల దుకాణదారులు పీసీలో పొందపరచని క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులను వివిధ ఏజెన్సీల ద్వారా తక్కువ ధరలకు కొనుగోలు చేసి, అధికారుల కన్ను కప్పి, రైతులకు ఎమ్మార్పీకంటే తక్కువకు విక్రయిస్తున్నారు. దీంతో లైసెన్సులు పొంది, సక్రమంగా వ్యాపారం నిర్వహించే కొంతమంది తమ వ్యాపారాలను కొనసాగించలేకపోతున్నారు. ఎలాంటి పీసీ లేకుండా వివిధ ఏజెన్సీల ద్వారా తక్కువ ధరకు కొనుగోలు చేసిన, బయో మందులు(నకిలీ)వాటి పైనున్న ధరలకంటే తక్కువగా విక్రయిస్తున్నారు. నిజమైన కంపెనీల నుంచి పొందిన డ్రిప్పు మందులను, బయోలను వ్యాపారులు అమ్ముకోలేక ఇబ్బంది పడుతున్నారు. రసాయన కంపెనీల నుంచి అనుమతి పొందిన ఏజెన్సీలు ఆ ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీలకే విక్రయిస్తున్నారు. దీంతో ఎరువుల దుకాణదారులు ట్రాన్స్‌పోర్టు, కూలీలు, వడ్డీలు, లాభం కోసం ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే ఎక్కువగా విక్రయించాల్సి వస్తోందని అంటున్నారు. ఇంత జరుగుతున్నా, సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చే ఎరువులను ఎమ్మార్పీలకు విక్రయించలేని వ్యాపారులు.. వివిధ కంపెనీలు సరఫరా చేసే క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులను ఎమ్మార్పీ కంటే తక్కువ కు విక్రయిస్తుండడం చర్చనీయాంశమైంది. ఎన్నో మోసపూరిత కంపెనీలు తమ బ్రాండ్ల పేరుతో నకిలీలను విక్రయిస్తున్నట్లు ఇటీవల రైతులు కూడా గుర్తిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలు చేసి నకిలీల నిగ్గు తేల్చాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఎరువుల దుకాణదారులు తమ వద్ద ఉన్న పీసీల్లో లేని బయోలు, క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులు, విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే ఆకస్మిక దాడులు నిర్వహించి, కఠిన చర్యలు తీసుకుంటాం. రైతుకు మోసం జరిగే ఏ కార్యక్రమమైనా చట్టవిరుద్ధమే.

\- సనావుల్లా, ఏడీ, వ్యవసాయశాఖ

మోసపోతున్నాం..



పంటలకు వచ్చే వివిధ రకాల పురుగులు, తెగుళ్ల నివారణ కోసం మందులను కొనుగోలుచేసి పిచికారి చేస్తున్నాం. ఇందులో కంపెనీలు విక్రయించే వాటికన్నా, బయోలు తక్కువ ధరకే విక్రయిస్తుండడంతో నష్టపోతున్నాం. డ్రిప్ ఎరువులు, కంపెనీల ఎరువులకు, బయోల ఎరువులకు చాలా తేడా ఉంది. ఎరువుల దుకాణదారులు పురుగుల మందులను తక్కువ ధరలకు విక్రయించడం, ఎరువులకు ఎక్కువ ధరకు విక్రయించడం ఈ మతలబు ఏమిటో అంతు చిక్కడంలేదు.

\- శ్రీధర్‌రెడ్డి, రైతు, సున్నంపల్లివారిపల్లి

డ్రిప్ ఎరువుల్లో భారీ మోసం



డ్రిప్ ఎరువులు, పురుగు మందుల్లో రైతులకు భారీగా మోసం జరుగుతోంది. ఏవి నకిలీవో, ఏవి అసలువో అంతుచిక్కడంలేదు. ఎరువుల దుకాణదారులు పురుగు మందులను, డ్రిప్ ఎరువులను ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయిస్తున్నారు. రసాయన ఎరువులను మాత్రం విక్రయించడంలో ఇబ్బందులున్నట్లు చెబుతారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయాలపై పర్యవేక్షించి, రైతులకు సక్రమమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులు అందేలా కృషిచేయాలి.

\- సూర్యనారాయణ, రైతు, కొత్తకురవపల్లి

చెత్తగా.. చెత్త సేకరణ

ఎంపీడీఓలు, డిప్యూటీలకు మెమోలు ఇవ్వండి

ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ



అనంతపురం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇంటింటి చెత్త సేకరణలో పలు మండలాల్లో 50శాతం కన్నా ఎక్కువ నెగెటివ్ వచ్చిందని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. ప్రభుత్వ ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఈ విషయం స్పష్టమైందని అన్నారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పంచాయతీ సెక్టార్, జీఎస్‌డబ్ల్యుఎస్ తదితర అంశాలపై డీపీఓ, డీఎల్డీఓలు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు, ఈఓఆర్డీలతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెత్త సేకరణ విషయంలో నిర్లక్ష్యం వహించిన ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలకు మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల (జీఎస్‌డబ్ల్యుఎస్) పెండింగ్ అంశాల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తల్లికి వందనం కోసం తల్లి, బిడ్డల ఈకేవైసీని వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీ సేవా సర్వీసెస్ డాష్‌బోర్డు, మన మిత్ర క్యాంపెయిన్‌లో పెండింగ్ అంశాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. సిటిజన్ ఈకేవైసీ, ఆధార్ సీడింగ్ ఫర్ వాహన్ డేటాను వేగంగా చేపట్టాలని అన్నారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ 100శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సరిగా పనిచేయనివారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌ను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని, సచివాలయాలలో క్యూఆర్ కోడ్ పెట్టాలని, ప్రజల ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. వీసీలో డీపీఓ నాగరాజు నాయుడు, సీపీఓ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరంతో టీడీపీ కార్యకర్త మృతి

కుటుంబాన్ని పరామర్శించిన పరిటాల శ్రీరామ్



రామాంజనేయులు (ఫైల్), కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న శ్రీరామ్

ధర్మవరం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శినమల గ్రామంలో డీలర్ చెన్నప్ప పెద్ద కుమారుడు, టీడీపీ కార్యకర్త కొండపాకుల రామాంజనేయులు(30) విషజ్వరంతో మృతి చెందాడు. మంగళవారం కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు ఇటీవల పని నిమిత్తం బెంగళూరుకు వెళ్లాడు. రెండురోజుల క్రితం విషజ్వరంతో బాధపడుతూ గ్రామానికి వచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి బెంగళూరుకు తీసుకెళ్లాలని సూచించారు. సోమవారం బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య గాయిత్రి, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. రామాంజనేయులు టీడీపీ బూత్‌కన్వీనర్‌గా ఉంటూ పార్టీకి సేవలందిస్తున్నారని, కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని స్థానిక నాయకులు తెలిపారు.

కుటుంబాన్ని ఆదుకుంటాం : పరిటాల శ్రీరామ్

దర్శినమల టీడీపీ బూత్‌కన్వీనర్ రామాంజనేయులు మృతి చెందిన విషయం తెలుసుకున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మంగళవారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. మృతుడి భార్య గాయిత్రికి జీవనాధారం కోసం సహాయం అందిస్తామని తెలిపారు. ఆయన వెంట క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి, విజయసారధి, నరసింహులు, పార్థారెడ్డి, రవి, తదితరులు ఉన్నారు.

ముసలమ్మ ఆలయంలో చోరీ

హుండీలో నగదు, 5 గ్రాములు బంగారం మాయం



ఆలయ హుండీని బయట పడేసిన దుండగులు

బుక్కరాయసముద్రం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని ముసలమ్మ దేవాలయంలో గుర్తు తెలియని దుండగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న 5 గ్రాముల బంగారం, హుండీలో ఉన్న నగదును సోమవారం రాత్రి చోరీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు అనంతపురం- తాడిపత్రి రహదారి పక్కన, చెరువు కట్ట వద్ద ముసలమ్మ దేవాలయం ఉంది. గుర్తు తెలియని దుండగులు ఈ ఆలయం వాకిలి పగలకొట్టి చొరబడ్డారు. ఆలయంలో ఉన్న హుండీ పగలకొట్టి అందులో ఉన్న నగదు, అమ్మవారి తాళిబొట్టు చైను, 5 గ్రాముల బంగారు చోరీ చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు హార్డ్‌డిస్క్ పగలకొట్టి ఎత్తుకెళ్లారు. హుండీలో దాదాపు రూ.4 లక్షల నుంచి 5 లక్షల వరకు ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ సుశీలాదేవి, సుర్యనారాణరెడ్డి సీఐ పుల్లయ్యకు తెలిపారు. ఈ సంఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి హిజ్రా ఆత్మహత్య



శ్రీవాణి(ఫైల్)

గుత్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని రామరాజుపల్లి-పామిడి రైల్వేస్టేషన్ మధ్య మిడుతూరు గ్రామ సమీపంలో రైలు కింద పడి నాగలపల్లి వంశీ అలియస్ శ్రీవాణి(21) అనే హిజ్రా ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. పామిడి మండలం ఎదరూరు గ్రామానికి చెందిన వంశీ, అలియస్ శ్రీవాణి సోమవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని అన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

నీవు లేకుండా ఎలా బతికేది నాన్నా..!

కుమారుడి ఆత్మహత్య.. కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



మన్సూర్‌వలి (ఫైల్)

తాడిపత్రి, జూలై 22(ఆంధ్రజ్యోతి): 'నీకు ఉద్యోగం లేకపోయినా బతకగలం. నీవు లేకుండా ఎలా బతికేది నాన్నా ..! ఎందుకు ఇలా చేశావ్?' అంటూ కుమారుడి మృతదేహంపై పడి తల్లిదండ్రులు విలపించిన సంఘటన మంగళవారం తాడిపత్రిలో జరిగింది. పట్టణంలోని విజయనగర్‌కాలనీకి చెందిన మన్సూర్‌వలి (22) ఉద్యోగం రాలేదని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు ఇస్మాయిల్, హర్షాబీ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా మరో కుమార్తె హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. కుమారుడు బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడం తో తల్లిదండ్రులు బోరున విలపించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బకాయి చెల్లించాలని ఎంపీఈఓకు నోటీసు

అనంతపురం అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రంలో పని చేస్తున్న ఎంపీఈఓ ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి ఎరువుల విక్రయాలకు సంబంధించి ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.1.28 లక్షలు బకాయి ఉండటంతో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ నోటీసు జారీ చేశారు. బత్తలపల్లిలో పనిచేస్తున్న సమయంలో ఎంపీఈఓ బకాయి పడ్డారు. అక్కడి నుంచి బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లి రైతు సేవా కేంద్రానికి ఆ ఎంపీఈఓ బదిలీపై వచ్చారు. రెండేళ్ల నుంచి బకాయి డబ్బులు చెల్లించకపోవడంతో ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బకాయి సొమ్ము చెల్లించాలని ఆమె నోటీసులు జారీ చేశారు. లేనిపక్షంలో క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యోగుల మనోభావాలు దెబ్బతీయొద్దు

ప్రజాప్రతినిధులే దాడులకు పాల్పడితే ఎలా..?
జేసీపీఆర్ అనుచిత వ్యాఖ్యలు అభ్యంతరకరం
ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కమిటీ



డీపీఓతో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి కమిటీ చైర్మన్, నాయకులు

అనంతపురం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు సహకరించాల్సిన ప్రజాప్రతినిధులే వారిపై దాడులకు సిద్ధపడితే ఎలా అని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కమిటీ ప్రశ్నించింది. రెండ్రోజుల క్రితం డీపీఓ నాగరాజునాయుడుపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉద్యోగుల మనోభావాలు దెబ్బతినడమే కాకుండా భయభ్రాంతులకు గురిచేసేలా ఉన్నాయని కమిటీ జిల్లా చైర్మన్ ఆర్ఎన్ దివాకర్ రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం కమిటీ ఆధ్వర్యంలో డీపీఓ నాగరాజునాయుడును కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జేసీ వ్యాఖ్యలను రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యం అనాలా..? ఏమైనా మాట్లాడవచ్చని భవిష్యత్ తరాలకు ఇచ్చే సంకేతంగా భావించాలా..? అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధుల వద్దే ఉద్యోగులకు రక్షణ కరువైతే ఎవరికి చెప్పుకోవాలన్నారు. విధినిర్వహణలో అధికారులు చేసింది తప్పయితే ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. సుదీర్ఘ అనుభవం ఉన్న ఒక ప్రజాప్రతినిధి ఇలా మాట్లాడటం సమంజసం కాదన్నారు. ముఖ్యమంత్రి స్పందించి తగిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ సిబ్బంది, అధికారులకు భరోసా కల్పించాలని అన్నారు. డీపీఓను కలిసిన వారిలో కమిటీ ఉపాధ్యక్షుడు కొండయ్య, మూర్తి, ఓబుళేసులు ఉన్నారు.

హైకోర్టులో ఏం జరుగుతుందో..?

(5వ పేజీ తరువాయి)

రిట్ పిటీషన్‌పై స్టేటస్‌కో ఇచ్చింది. ఇదే క్రమంలో సంబంధిత న్యాయవాది తరఫున అనంత జేడీఏ కార్యాలయంలో కోర్టు ఆర్డర్‌ను అందజేసినట్లు సమాచారం. అయితే తమకు కోర్టు ద్వారా నేరుగా ఉత్తర్వులు రాలేదన్న కారణంతో సంబం ధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదని సమాచారం. న్యాయవాది ద్వారా ఆర్డర్‌ను జేడీఏ కార్యాలయంలో అందజేసినా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదని బాధిత సిబ్బంది వాపోతున్నారు. కోర్టు ఆదేశాల మేరకు రెండు వారాలపాటు సిబ్బందిని యథాస్థానంలో ఉంచాల్సి ఉంది. అయితే సంబంధిత ఉన్నతాధికారులు ఆ పని చేయకపోవడం గమనార్హం.

నేడు విచారణ

శ్రీసత్యసాయి జిల్లాలోని 11 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లతో పాటు కర్నూలులో 20 మంది, ప్రకాశం జిల్లాకు చెందిన ఏడుగురు అగ్రికల్చర్ అసిస్టెంట్లు తమకు బదిలీల్లో అన్యాయం జరిగిందని హైకోర్టును వేర్వేరుగా ఆశ్రయించారు. మూడు జిల్లాల సిబ్బంది రిట్ పిటీషన్లపై హైకోర్టు వేర్వేరుగా స్టేటస్‌కో ఆర్డర్లు జారీ చేసింది. అయితే మూడు జిల్లాల సిబ్బందిది ఒకే సమస్య కావడంతో అందరి పిటీషన్లను కలిపి బుధవారం విచారణ చేయాలని హైకోర్టు నిర్ణయించింది.

ఓ అధికారి వైఖరితోనే...

ఉమ్మడి జిల్లాలో అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల్లో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఓ అధికారి బదిలీల్లో తనకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఆయన వైఖరితోనే తమకు అన్యాయం జరిగిందని బాధిత సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ముడుపుల బాగోతం నేపథ్యంలోనే బదిలీల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అనంత జిల్లాలోని పలువురు సిబ్బందికి అన్యాయం జరిగినా... బయటకు చెప్పుకునేందుకు భయపడుతున్నట్లు సమాచారం. అయితే శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 11 మంది తమకు జరిగిన అన్యాయంపై న్యాయ పోరాటానికి దిగారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు హరినాథ్‌రెడ్డి, జహీర్, రేణుకా, సుస్మిత, జనార్దన్, తరుణ్‌రెడ్డి, శిరీష, రజిత, సంధ్య, నేత్ర, సర్‌తాజ్‌లు హైకోర్టులో రిట్ పిటీషన్ వేసిన వారిలో ఉన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ సుస్మితది ఉమ్మడి అనంత జిల్లాలో ఐదో ర్యాంక్, శ్రీసత్యసాయి జిల్లాలో రెండో ర్యాంక్, మరో అగ్రికల్చర్ అసిస్టెంట్ జనార్దన్‌ది ఉమ్మడి జిల్లాలో ఆరో ర్యాంక్, సత్యసాయి జిల్లాలో మూడో ర్యాంక్ ఉన్నప్పటికీ బదిలీల్లో అన్యాయం చేశారు. ఆ సిబ్బంది అడిగిన మూడు ఆప్షన్లల్లో ఏ ఒక్కటి ఇవ్వకుండా.. తక్కువ ర్యాంక్ ఉన్న సిబ్బందికి ఆయా స్థానాలు ఇచ్చారని బాధిత సిబ్బంది ఆవేదన చెందుతున్నారు.

రైళ్ల వేళల మార్పు

గుంతకల్లు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్ల సమయాలను సవరించినట్లు మంగళవారం రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-గ్వాలియర్ ఎక్స్‌ప్రెస్ (11085) సెప్టెంబరు 22 నుంచి ఐదు నిమిషాలు ఆలస్యంగా అనంతపురానికి రాత్రి 8-23 గంటలకు వస్తుందన్నారు. ధర్మవరం-నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ (17248) తిరుపతికి సెప్టెంబరు 17 నుంచి 25 నిమిషాలు ముందుగా సాయంత్రం 6-20 గంటలకే చేరుకుంటుందన్నారు. ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22159) గుంతకల్లుకు జూలై 25 నుంచి అరగంట ఆలస్యంగా ఉదయం 3 గంటలకు చేరుకుంటుందన్నారు. హుబ్లీ-చెన్నై ఎక్స్‌ప్రెస్ (17313) ఈనెల 25 నుంచి గుంతకల్లుకు ఐదు నిమిషాలు ఆలస్యంగా ఉదయం 3-05 గంటలకు చేరుతుందన్నారు. ఏక్తానగర్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (20920) ఈ నెల 30 నుంచి 15 నిమిషాల ఆలస్యంగా ఉదయం 6-55 గంటలకు చేరుకుంటుందన్నారు. అహ్మదాబాద్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22920) ఈ నెల 28 నుంచి గుంతకల్లుకు 15 నిమిషాల ఆలస్యంగా ఉదయం 6-55 గంటలకు చేరుతుందన్నారు. ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (12163) ఈ నెల 25 నుంచి గుంతకల్లుకు 20 నిమిషాల ఆలస్యంగా ఉదయం 8 గంటలకు చేరుతుందని తెలియజేశారు. పూనా-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (16381) ఈ నెల 25 నుంచి గుంతకల్లుకు 20 నిమిషాలు ఆలస్యంగా ఉదయం 9-50 గంటలకు చేరుకుంటుందని వెల్లడించారు.

జర్మనీ భాషపై ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ చేసిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు జర్మనీ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీ కుష్బూకొఠారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 8నెలల పాటు ఈశిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రాష్ట్రంలో విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో ఈశిక్షణకేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. అర్హత కలిగి ఎంపికైన ఎస్సీ, ఎస్టీ బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని హార్డ్‌కాపీలను జిల్లా కార్యాలయంలో అందజేయాలని డీడీ కోరారు.

రూడ్‌సెట్‌లో ఫొటో, వీడియోగ్రఫీలో...

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఈనెల 29 నుంచి ఆగస్టు 28 వరకు ఉచితంగా ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి రేషన్, ఆధార్‌కార్డు కలిగిన ఉమ్మడి జిల్లా నిరుద్యోగ పురుషులు అర్హులన్నారు. 31రోజుల పాటు సాగే శిక్షణా కాలంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు ఎస్కేయూ సమీపంలోని రూడ్‌సెట్ సంస్థ కార్యాలయంలో నేరుగా లేదా సెల్ నంబరు 9492583484ను సంప్రదించాలని కోరారు.

టమోటా కిలో రూ.40



అనంతపురం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 3వేల టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. అదేవిధంగా టమోటా కిలో కనిష్ట ధర రూ.20, సరసరా సరిధర రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు.

అందరికీ ఉద్యోగోన్నతులు ఇవ్వండి - యూటీఎఫ్



విద్యాశాఖ ఏడీకి వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, జూలై 22(ఆంధ్రజ్యోతి): అన్నిసబ్జెక్టు టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ ఏడీ శ్రీనివాసులును యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు, రమణయ్య, సుధాకర్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల ఇద్దరు టీచర్లకు.. మిగిలిన ఫిజికల్ సైన్స్ పోస్టులకు ఉద్యోగోన్నతులు ఇవ్వడం హర్షణీయమే అన్నారు. అలాగే ఇతర సబ్జెక్టుల లోను అనేక పోస్టులు మిగిలిపోయాయని, వాటికి సంబంధిత అర్హత కలిగిన ఎస్జీటీలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరికి మాత్రమే ఉద్యోగోన్నతులు ఇవ్వడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అలా కాకుండా అందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి):అనంత వ్యవసాయ మార్కెట్‌లో మంగలవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 16వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 754 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

కేసీ నారాయణకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గుంతకల్లు టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో ప్రముఖ విద్యావేత్త, అనంతపురం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, శంకరానందగిరిస్వామి ఎడ్యుకేషనల్ సొసైటీ మాజీ కరస్పాండెంట్ కేసీ నారాయణ తృతీయ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని కేసీ నారాయణ విగ్రహానికి కళాశాల డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ ఆర్ సురేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కేసీ నారాయణ తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారన్నారు. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కళాశాలలను స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తమ్మినేని వెంకటరమణ, బసెట్టి క్రిష్ణయ్య, పూజారి గోపీ, ఎం ఖాజావలి, నటరాజ్, వరప్రసాద్, కురుపాటి రాకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయండి: డీటీడబ్ల్యూఓ

అనంతపురం విద్య, జూలై 22(ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేసి గిరిజన సంక్షేమ శాఖకు మంచి పేరు తేవాలని వార్డెన్లకు డీటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు సూచించారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ అడ్మిషన్లు పెంచడానికి కృషి చేయాలన్నారు. తొలుత ఎస్టీ పిల్లలకు అవకాశం ఇచ్చిన తర్వాతనే ఇతర కులాల విద్యార్థులకు సీట్లు కేటాయించాలన్నారు. గురుకులాల్లోనూ ఇదేవిధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ సురేష్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

డ్రిప్‌ను సద్వినియోగం చేసుకోండి: ఏపీడీ

బెళుగుప్ప, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీతో అందించే డ్రిప్, స్ప్రింక్లర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ పేర్కొన్నారు. మంగళవారం ఏపీడీ మండలంలోని నక్కలపల్లి వద్ద వ్యవసాయ తోటలో పర్యటించి రైతులకు బిందు సేద్య పరికరాల సద్వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 17 వేల హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాల పంపిణీ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని పంటలు పండించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఏవో మల్లేష్ సిబ్బంది దిలీప్, అవినాష్ పాల్గొన్నారు.

ఈ- చలాన్ లింక్స్‌తో జాగ్రత్త: ఎస్పీ

అనంతపురం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఈ-చలాన్ పేరుతో వచ్చే లింక్స్ ప్రమాదకరమని, వాటిని ఎవరూ ఓపెన్ చేయవద్దని, జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ జగదీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆర్టీవో, ట్రాఫిక్ చలాన్, ఏపీకే పేరుతో కొన్ని లింకులు వైరల్ అవుతున్నాయన్నారు. ఇలాంటి లింక్స్ ఎవరూ డౌన్‌లోడ్ గానీ, ఓపెన్ గానీ చేయవద్దని ఆయన సూచించారు. పీఎం కిసాన్ యోజన, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులు, రివార్డులు, కేవైసీ అప్డేట్ పేరుతో సైబర్ నేరాలకు పాల్పడే మోసగాళ్లు ఈ తరహా లింకులు పంపి మోసాలకు పాల్పడతారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు, అనధికార లింక్స్‌ను ఎవరూ వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయవద్దన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని, వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలని ఎస్పీ జగదీష్ సూచించారు.

అగ్రిగోల్డ్ రికార్డులు సిద్ధంగా ఉంచుకోండి: డీఆర్ఓ



అధికారులతో సమావేశమైన డీఆర్ఓ

అనంతపురం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అగ్రిగోల్డ్ ఆస్తుల భౌతిక ధ్రువీకరణ పూర్తి చేసి, రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని డీఆర్ఓ మలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అగ్రిగోల్డ్ ఆస్తులపై సంబంధిత కమిటీ మెంబర్లతో డీఆర్ఓ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తుల అటాచ్‌మెంట్‌పై జిల్లా స్థాయిలో జేసీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ విలువ, మార్కెట్ విలువ గుర్తింపు చేయాలని, అగ్రిగోల్డ్ భూముల పరిస్థితి ఏంటి, ఆక్రమణలు, కోర్టు కేసులు తదితర అంశాలకు సంబంధించి పరిశీలన చేయాలన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, సంబంధిత తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు అన్ని వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, వసంతలత, రియాజుద్దీన్, కర్నూలు సీఐడీ ఇన్‌స్పెక్టర్ ప్రీతంరెడ్డి, అశోక్, ఎస్ఐ శివకుమార్‌నాయక్, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసులు, డీపీఆర్ఓ బాలకొండయ్య, ఐటీ ఆఫీసర్ రవి, ఎన్ఐసీ డీఐఓ రవిశంకర్, తహసీల్దార్లు సోమశేఖర్, శేషారెడ్డి, సుమతి, శ్రీనివాసులు, అగ్రిగోల్డ్ ప్రతినిధి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తును వదిలి..

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



భారతి

గుంతకల్లుటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కళ్లముందు కదలాడుతున్న భవిష్యత్తు 'బంగారాన్ని' వదిలి ఓ మహిళ ఒకటిన్నర తులం బంగారం కోసం ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మండలంలోని నల్లదాసరిపల్లిలో మంగళవారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన మస్తాన్, పద్మా దంపతుల కుమార్తె భారతి(20)ని తమ సమీప బంధువు గుంతకల్లు పట్టణానికి చెందిన రాముకు ఇచ్చి గత ఏడాది మార్చిలో వివాహం చేశారు. కాన్పు కోసం భారతి ఆరు నెలల కిందట పుట్టింటికి వెళ్లింది. కుమారుడు జన్మించాడు. అందరూ ఆనందంగా ఉన్న సమయంలో తల్లిదండ్రులు పెళ్లి సమయంలో ఇస్తామన్న ఒకటిన్నర తులం బంగారం విషయాన్ని భారతి సోమవారం ప్రస్తావించింది. ఏడాది తరువాత ఇస్తామని తల్లిదండ్రులు చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన భారతి మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీకి ఉన్న ఇనుప కడ్డీకి చీరతో ఉరి వేసుకుంది. కాసేపటి తర్వాత గమనించిన తల్లిదండ్రులు ఉరికి వేలాడు తున్న ఆమెను కిందికి దించి పరిశీలించగా మృతి చెందినట్లు నిర్ధారిం చారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప తెలిపారు.

28 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్/బుక్కరాయసముద్రం, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 28 మండలాల్లో సోమవారం వర్షం కురిసింది. అత్యధికంగా గుత్తిలో 31.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. గుంతకల్లు, యాడికి, బెళుగుప్ప 20.2, యల్లనూరు 15.2, విడపనకల్లు 14.2, తాడిపత్రి 12.4, ఉరవకొండ 10.2, రాప్తాడు 9.2, గుమ్మఘట్ట 8.8, రాయదుర్గం 7.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 6.4మి.మీ. లోపు కురిసింది. అనంతపురం, శింగనమల, పుట్లూరు, యాడికి మండలాల్లో మంగళవారం జల్లులు పడ్డాయి.

రానున్న ఐదు రోజులకు వర్ష సూచన

ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షం పడే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.5-33 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.7-23.1 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చు అన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 6 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

చెట్టుకొమ్మ పడి మహిళ మృతి

గుడిబండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరుబాగల్ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ బూత్ ఇన్‌చార్జ్ నాగరాజు భార్య అరుణ(34)పై చెట్టు కొమ్మ విరిగిపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో కరేకెర కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న కుమార్తెను చూసేందుకు ద్విచక్ర వాహనంలో వెళుతున్న సమయంలో కేఎస్‌పల్లి, చిగతుర్పి మధ్యలో గాలికి చెట్టుకొమ్మ విరిగి తలమీద పడటంతో కిందపడింది. గాయపడ్డ అరుణను వెంటనే మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగరాజు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

న్యూస్ బాక్స్

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఉమ్మడి అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సిబ్బందికి సూచించారు. ధర్మవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయనతో పాటు పుట్టపర్తి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి : ఎంపీడీఓ

బత్తలపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గ్రామ సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరసింహనాయుడు మాట్లాడుతూ.. పీ4 సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఏఓ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీఓ క్రిష్టప్ప, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులు

ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ అండర్-16 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం రామకృష్ణప్ప, పీడీ నాగేంద్ర తెలిపారు. అనంతపురంలోని న్యూటౌన్ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన ఎంపిక పోటీల్లో మనోజ్‌కుమార్, అశోక్, సాయిప్రసాద్ ఎంపికయ్యారని తెలిపారు. వారు ప్రకాశం జిల్లాలో వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరపున పాల్గొంటారన్నారు.

సీపీఐ పట్టణ కమిటీ ఎంపిక

ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): సీపీఐ పట్టణ నూతన కమిటీని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపికచేశారు. స్థానిక ఎన్జీఓహోంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ ఎనిమిదో సీపీఐ మహాసభలో పట్టణ కార్యదర్శిగా పూలశెటి రవికుమార్, సహాయ కార్యదర్శులుగా ఎర్రంశెట్టి రమణ, శ్రీనివాసులను రెండో సారి ఎంపికచేశారు. కార్యవర్గ సభ్యులుగా వెంకటస్వామి, వెంకటనారాయణ, రాజా, చెన్నంపల్లి శ్రీనివాసులు, శ్రీధర్, ఆదినారాయణ, శ్రీనివాసులు, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, తాజుద్దీన్, మసూద్, ఈశ్వర్, జనార్దన్, లలితమ్మ, లింగమ్మను ఎంపికచేశారు.

సీపీఐ మండల కార్యదర్శిగా లక్ష్మీనారాయణ

తాడిమర్రి, జూలై 22(ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల కమిటీని మంగళవారం ఎంపిక చేశారు. మండల కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా రామకృష్ణ, సహాయ కార్యదర్శులుగా సన్న పెద్దన్న, హరి, ప్రకాశ్, లక్ష్మీనారాయణ, పోతలయ్య, చౌడప్పను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, నియోజకవర్గ కార్యదర్శి మధు పేర్కొన్నారు.

మున్సిపల్ పాఠశాలకు మైకు వితరణ


పాఠశాలకు మైకు అందజేస్తున్న యోగా గురువు

ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న మున్సిపల్ పాఠశాలకు ఓం ఆదిగురు ఉచిత యోగా కేంద్రం మార్కెట్‌యార్డ్ గురువు గొర్ల నారాయణరెడ్డి, యోగ సాధకుల బృందం మైకు వితరణ చేశారు. వారు మంగళవారం పాఠశాల లో ప్రార్థన సమయంలో హెచ్ఎం ఉమాపతికి అందజేశారు.

'పాఠశాలకు సహకారం అందిస్తాం'

ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో తమ వంతు సహకారం అందిస్తామని పూర్వపు విద్యార్థులు మహేశ్వరరెడ్డి, నరేశ్, సాయికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని సుందరయ్య నగర్‌లో ఉన్న గణేశ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం 2013-14 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు మంగళవారం రూ.12వేలు విలువ చేసే 200 ప్లేట్లను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మయ్య, రాంప్రసాద్, రామకృష్ణ, రామాంజినేయులు, ఓబుళేశు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో నేడు ర్యాలీ

ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విజయవంతం కావాలంటూ బుధవారం పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించనున్నట్టు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అడ్డగిరి శ్యాంకుమార్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10-15గంటలకు స్థానిక అన్నపూర్ణేశ్వరిదేవి ఆలయం వద్ద నుంచి బైకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

● కదిరిఅర్బన్: హరిహర వీరమల్లు చిత్రం విజయవంతంవ కావాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నాయకులు, అభిమా నులు ప్రత్యేక పూజలు చేశారు. 101 కొబ్బరికాయలను కొట్టారు. అలాగే బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఆర్అండ్‌బి బంగ్లానుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జ్ భైరవప్రసాద్ తెలిపారు.

స్వచ్ఛతపై ప్రత్యేక బృందం సర్వే

ఓబుళదేవరచెరువు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు చెత్త సేకరణ కేంద్రాలను మంగళవారం స్వచ్ఛభారత్ ప్రత్యేక బృందం పరిశీలించింది. బృందం లీడర్ రామాంజనేయులు, కోఆర్డినేటర్ శ్రీనివాసులు అల్లాపల్లి పంచాయతీలోను, గౌనిపల్లి అంగన్‌వాడీ కేంద్రం, అనంతరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. వారితో పాటు ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి మల్లికార్జున్, సర్పంచ్ వెంకటరమణ, మండలకోఆర్డినేటర్ రమణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముద్దచర్మ వ్యాధి నివారణకు టీకా

ఓబుళదేవరచెరువు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆవులు, దూడలకు వ్యాపించే ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకీలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలపరిధిలోని తిప్పేపల్లి, బుచ్చరాజుపల్లి, నారప్పగారిపల్లి, ఇ. చెర్లోపల్లిల్లో టీకాలు వేశారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఆయనతో పాటు సిబ్బంది మాధవి, విమల, పూజిత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల మండల కమిటీ ఎంపిక

నల్లచెరువు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీల యూనియన్ మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా రాజేశ్వరి, కార్యదర్శిగా భాగ్యమ్మ, కోశాధికారిగా సుజాత, సభ్యులుగా అరుణ, సరస్వతి, పద్మా, నాగలక్ష్మిని ఎంపిక చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబూనిస్సా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటితో ఇబ్బందులు

● గ్రామాల్లో అవస్థలు పడుతున్న ప్రజలు

● ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన


కొత్త చెరువులో సీసీరోడ్డుపై నిలిచిన మురుగునీరు

కొత్తచెరువు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక యూనియన్ బ్యాంకు వెనక బాలికల పాఠశాల సమీపంలో సీసీరోడ్డుపై మురుగునీటితో పాటు వర్షపు నీరు నిలిచింది. దీంతో ఇళ్లలోకి వెళ్లాలంటే ఆనీటిలోనే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. మురుగునీరు, వర్షపు నీరు వెళ్లేందుకు దారిచూపాలంటూ పలుమార్లు పంచాయతీ అధికారులు, సర్పంచ్‌కు తెలిపిన పట్టించుకోలేదన్నారు. కొన్ని రోజులుగా నీరునిలబడటంతో రోడ్డు పాచిపట్టిందని... దీంతో వృద్ధులు, చిన్నారులు ఆ రోడ్డుపై వెళ్లాలంటే భయంభయంగా ఉందన్నారు. అంతేకాకుండా కొన్ని సందర్భాల్లో వృద్ధులు, చిన్నారులు జారి పడుతున్నారని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● గాండ్లపెంట: మండలపరిధిలోని కటారుపల్లి పంచాయతీ గ్రామ సచివాలయం ఎదుట మురుగునీటి కుంట అధికారులకు కనిపించదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివాస్ అంటూ ప్రజలకు అవగా హన కల్పిస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయని అధికారులు చెబుతారు కానీ, ఆచరణలో లేదంటున్నారు. సచివాలయం ఎదుట దాదాపు ఆర్నెల్ల నుంచి మురుగు నీటి కుంట ఏర్పడింది. ఈ నీటిని దారి మళ్లించకుండా అలాగే వదిలేశారు. వర్షాకాలంలో సచివాలయానికి వెళ్లాలంటే పాచిపట్టిన మట్టి జారుతోందని భయపడుతున్నట్లు ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి కుంటను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

● నంబులపూలకుంట: మండలకేంద్రంలోని బస్‌షెల్టర్ సమీపంలో మురుగునీరు, చెత్తచెదారం నిలువ ఉండి కంపుకొడుతోందని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా దుకాణాల్లో తినుబండారాలు విక్రయిస్తుంటారు. పైభాగంలోని ప్రభుత్వాసుపత్రి నుంచి ఇక్కడికి మురుగునీరు చేరుతోంది. దీంతో పాటు చెత్తచెదారం నిలువ ఉండి దుర్వాసన వస్తోందని అంటున్నారు. ఈ నీరు బయటకెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలో మురుగునీటి కాలువలు లేక ప్రజలు చాలా ఇందులు పడుతున్నారు.


కటారుపల్లి సచివాలయం ఎదుట...


నంబులపూలకుంటలోని బస్‌షెల్టర్ ప్రాంతంలో ...

చంద్రబాబుతోనే సుపరిపాలన

● ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి


బడేనాయక్‌తండాలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ఆమె మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో బడేనాయక్‌తండా, గోనేనాయక్‌తండాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి కరపత్రాలు పంపిణీ చేసి, వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమపథకాలను అందజేస్తున్నామన్నారు. పుట్టపర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరిగెత్తించి నంబర్ వన్‌గా నిలుపుతామన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థులకు ఆంగ్లపాఠాన్ని బోధించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సన్నబియ్యంతో మధ్యాహ్నభోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నా రు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ : ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మంగళవారం స్థానిక క్యాంపుకార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ఐదు పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ 3,60,070 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఏడాదిలోనే నియోజకవర్గంలో రూ. 2..55కోట్లకు పైగా సీఎం సహాయనిధి ద్వారా 55 మందికి ఆర్థికసాయం అందజేసినట్లు పేర్కొన్నారు.

'మార్కెట్‌యార్డును అభివృద్ధి చేస్తాం'

ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డ్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ధర్మవరం మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ అంబటి అరుణశ్రీ, వైస్ చైర్మన్ అయ్యప్ప పేర్కొన్నారు. వారు మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేశ్‌ను కలిసి మార్కెట్‌యార్డ్ స్థితిగతుల గురించి చర్చించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్‌యార్డ్ ఐదేళ్లలో దాదాపు రూ. 56లక్షలు ఆదాయం కోల్పోయిందని తెలిపారు. ఆ ఆదాయాన్ని రాబట్టుకునే విధంగా చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటామని ఆర్డీఓకు విన్నవించారు.

మాజీ సీఎం అచ్యుతానందన్‌కు ఘననివాళి

ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కు సీపీఎం నాయకులు ఘన నివాళులర్పించారు. సీపీఎం స్థానిక కార్యాలయంలో మంగళశారం అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సీపీఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ...మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి సీపీఎంకు తీరని లోటని, ఆయన ఆశయాలు సాధించేందుకు నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, నాయకులు అనిల్, అమన్, రాజు పాల్గొన్నారు.

భూ కబ్జాల్లో వైసీపీ నాయకులు

● టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దుల క్రిష్ణమూర్తి

తనకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా కదిరితో పాటు అన్ని మండలాల్లో వైసీపీ నాయకులు తమ పాలనలో భూ కబ్జాలకు పాల్పడ్డారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దుల క్రిష్ణమూర్తి ఆరోపించారు. ఆయన మంగళవారం తనకల్లులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కదిరితో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు భూకబ్జాలకు పాల్పడినట్లు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో అవి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. నాడు నోరుమెదపలేని నిరుపేదలందరూ నేడు ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. అలాగే అక్రమ మద్యం కేసుల్లో ఒక్కొక్కరుగా వెలుగులోకి వస్తున్నారన్నారు. అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులెవరూ ప్రభుత్వ నుంచి తప్పించుకోలేరని ఆయన పేర్కొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

● ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే


కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బాధ్యతగా పనిచేయాలని వైద్య సిబ్బందితో పాటు ఆసుపత్రి కమిటీ సభ్యులకు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రి భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు, ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కమిటీ ఐదుగురు సభ్యుల్లో రోజూ ఆస్పత్రిలో పరిశీలించాలన్నారు. అలాగే వైద్యులు, సిబ్బంది రోగులకు ఉత్తమ సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా ఇక్కడకి ఎక్కువ మంది పేదలు వస్తారని వారికి మంచి వైద్యం అందించాలన్నారు. రోజూ ఆస్పత్రి ఆవరణలో ఫాగింగ్ చేయాలన్నారు. ఆసుపత్రిలో చేపట్టవలసిన ముఖ్యపనులను ఆర్ఎంఓ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. గైనిక్ వార్డులో గర్భిణులను పరీక్షించాడానికి ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని కోరారు. అత్యవసర సేవలు సరిగా అందడం లేదని కమిటీ సభ్యులు వివరించగా.... పని భారం ఎక్కువగా ఉందన్నారు. ఖాళీగా ఉన్న నర్సులు, ఎంఎన్ఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, డీసీహెచ్ఓ మధుసూదన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, కమిటీ సభ్యులు రెడ్డిభాష, వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ శంకరయ్య, కుటాల లక్ష్మణ్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులకు నీటి సరఫరా

కొత్తచెరువు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజయనగర కాలనీలో ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న తాగునీటి ట్యాంకులకు అధికారులు మంగళవారం నీటిని సరఫరా చేశారు. 'నిరుపయోగంగా నీటి ట్యాంకులు' అన్న వార్తాకథనం ఆదివారం ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన పంచాయతీ ఈఓ శ్రీనివాస రెడ్డి ఆ కాలనీలోని తాగునీటి ట్యాంకులను పరిశీలించి సత్యసాయిబాబా వాటర్ సప్లై ద్వారా నీటిని అందించారు. దీంతో కాలనీ వాసులు దాహార్తి తీర్చినట్టు అయింది.

పార్టీ బలోపేతానికి పనిచేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్


నూతన కార్యవర్గంతో జీఎం శేఖర్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి

పుట్టపర్తి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పిలుపునిచ్చారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నూతనంగా ఎంపిక చేసిన జిల్లా నూతన కార్యవర్గ ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి హాజరయ్యారు. సూచనలు, సలహాలు పాటిస్తూ పార్టీ అభివృద్ధికి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడెసె దేవానంద్, పార్టీ సీనియర్ నాయకులు తలుపుల గంగాదర్, ఉత్తమ్‌రెడ్డి, నాయకులు సుదర్శన్, మేకల శీనా, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నుంచి పంటను కాపాడుకోండి

నంబులపూలకుంట, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సాగుచేసిన వేరుశనగను చీడపీడల నుంచి కాపాడుకోవాలని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ధనియార్‌చెరువు, వంకమద్ది గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

జలధికి తరలిన పీర్లు


చౌటకుంటపల్లిలో జలధికి తరలుతున్న పీర్లు

నల్లమాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటకుంటపల్లి, కురలమాల గ్రామాల్లో పీర్లను మంగళవారం జలధికి తరలించారు. మొహర్రం సందర్భంగా ఆయా గ్రామాల్లో కొలువు దీరిన పీర్లను అలం కరించి ప్రార్థనలు చేశారు. సోమవారం గ్రామంలో ఊరేగించి, రాత్రి అగ్ని గుండం వద్ద అల్లావు తొక్కారు. మంగళవారం పీర్లను జలధికి తరలించారు.


జౌకల గ్రామంలో ఉరుసు పీరును ఊరేగిస్తున్న గ్రామస్థులు

● నంబులపూలకుంట: మండలపరిధిలోని జౌకల గ్రామంలో మొహర్రం సందర్భంగా కొలువుదీరిన పీర్లకు మంగళవారం జలధి నిర్వహించారు. గ్రామంలో ఉరుసు పీరును ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. ప్రతి ఇంటివద్ద చక్కెర చదివింపులు చేశారు. చావిడి వద్ద అగ్నిగుండం వద్ద అల్లావు తొక్కారు. అనంతరం ఉరుసు పీరును జలధికి తరలించారు.

వర్షం కోసం గంగమ్మకు పూజలు


గంగమ్మ దేవతకు జలధి పూజ చేస్తున్న భక్తులు

తాడిమర్రి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన గంగమ్మ దేవతకు మంగళవారం జలధి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కురుబ వీధి సమీపంలో ఉన్న ఆలయం వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అలంకరించి గ్రామంలో ఊరేగించారు. వర్షాలు బాగా కురవాలంటూ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.


గంగమ్మకు బోనాలు సమర్పిస్తున్న దృశ్యం

● గాండ్లపెంట: వర్షం కోసం ఎల్లుగుట్టపల్లి గ్రామస్థులు మంగళవారం మండలకేంద్రంలోని గంగమ్మ దేవతకు బోనాలు సమర్పించారు. ఖరీఫ్ సాగుకు అదును ముగుస్తున్నా వర్షాలు కురవక పోవడంతో, వర్షాలు కురవాలని అమ్మవా రికి ప్రత్యేక పూజలు చేసి, బోనాలు, జ్యోతులు సమర్పించారు. గ్రామ ఉప సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డును ధ్వంసం చేశారని ఫిర్యాదు

కొత్తచెరువు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని ఇరగంపల్లి నుంచి తలమర్లకు వెళ్లే పంచాయతీ రాజ్‌శాఖకు చెందిన రహదారిని కొందరు ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశారని కాంట్రాక్టర్ రమణారెడ్డి మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాదాపు 250 మీటర్ల పొడవున మట్టి, మెటల్ తొలగించి రోడ్డును డ్యామేజ్ చేశారన్నారు. తారు రోడ్డు వేసే సమయంలో డ్యామేజ్ చేయడంతో తనకు రూ. 2.50 లక్షలు నష్టం నష్టం కల్గించారని ఫిర్యాదు చేశామని కాంట్రాక్టర్ తెలిపారు. కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

డీలర్‌పై ఫిర్యాదు

ఓబుళదేవరచెరువు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకమర్ల పంచాయతీ ఎద్దువారిపల్లిలో చౌక డిపో 29 డీలర్ గంగాద్రిపై పలువురు మంగళవారం ఇన్‌చార్జ్ తహసీ ల్దార్ శ్రీనివాస రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఉదయం 8గంటలకు షాపు తెరవాల్సి ఉండగా రోజూ గంటల తరబడి ఆలస్యం అవుతోందన్నారు.

ముదిగుబ్బను సస్యశ్యామలం చేస్తాం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

● యోగివేమన ప్రాజెక్ట్‌కు నీరందించే పనుల పరిశీలన


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, జూలై 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని టీడీపీ ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆయన మంగళవారం ముదిగుబ్బ మండలంలోని మలకవేముల సమీపంలో హంద్రీనీవా కాలువ ప్రాంతాన్ని హంద్రీనీవా, మైనర్ ఇరిగేషన్ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం కాలువ లైనింగ్ పనులు జరుగుతున్న నేప థ్యంలో మండలంలోని యోగివేమన రిజర్వాయర్‌తో పాటు పలు చెరువులకు నీరందించేలా రెండు గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు గేట్ల ద్వారా సానేవారిపల్లి చెరువు నుంచి మద్దిలేరు వంక మీదుగా యోగివేమన ప్రా జెక్టుకు నీరందేలా ప్రణాళిక చేశారు. మార్గమధ్యలో సుమారు అ న్ని చెక్ డ్యామ్‌లు, కుంటలకు నీరు అందనుంది. అయితే ఇంకా కొన్ని ప్రాంతాలకు నీరందించాలనే రైతుల విజ్ఞప్తి మేరకు కాలువ కు మరో రెండు గేట్లు పెట్టాలని ఆయన అధికారులకు సూచించా రు. దీనిపై జలవనరుల శాఖ మంత్రితో పాటు హంద్రీనీవా అధికారులతో మాట్లాడుతామన్నారు. రానున్న రెండేళ్లలో ఈ ప్రాంతంలో నీటి సమస్య తీరుతుందని శ్రీరామ్ పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ: మండలంలోని మలకవేముల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బండి మల్లికార్జున కుమారుడు రూపేంద్ర ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. పరిటాల శ్రీరామ్ వారింటికి వెళ్లి మల్లికార్జునను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఇరిగేషన్ అధికారులు, టీడీపీ నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, చింతలపల్లి మహేష్, కోట్ల బాబి, నరసింహ యాదవ్, మహబూబ్ పీరా, వినోద్ బాబు, కోన రవీంద్ర, గోపాల్ రెడ్డి, ఆనంద్, తుమ్మల సూరి, ఉత్తమనాయుడు, త్రిలోక్, సోము, వెంకటనారాయణ, గుర్రం కరుణాకర్, సూరి, శివయ్య, వెంకట్‌రాముడు, నారాయణ స్వామి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరిక


జనసేన పార్టీలోకి చేరుతున్న వారితో చిలకం మధుసూదన్‌రెడ్డి


ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మల గ్రామంలో వైసీపీ నుంచి 50 కుటుంబాలు జనసేనలోకి చేరాయి. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బీజేపీలోకి ...


బీజేపీలోకి చేరిన వారితో ఆ పార్టీ నాయకుడు హరీష్‌బాబు

ధర్మవరం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులు, హేష్, గోపాల్, కుళ్లాయప్ప, విశ్వనాథ్ తదితరుల కుటుంబసభ్యులు, మిత్ర బృందం పలువురు బీజేపీలోకి చేరారు. గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన మంత్రి సత్యకుమార్ నియోజకవర్గ ఇన్‌చార్ హరీష్‌బాబు హాజరయ్యారు. ఆయన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఘనంగా మారెమ్మ ఉత్సవం



అగళి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో మంగళవారం మారెమ్మ దేవత ఉత్సవం ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు మోస్తూ మొక్కుబడులు తీర్చుకున్నారు. అదేవిధంగా ఆలుడి జంగమరణహళ్లి గ్రామాలలో ఉత్సవాలు జరుపుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణతో అలంకరించి మహిళలు హారతులు మోస్తూ తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఉత్సవాలకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వినియోగం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విశేష అలంకరణలో కొలువుదీరిన వడిసలమ్మ



మడకశిర టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆషాడమాసాన్ని పురస్కరించుకుని చివరి మంగళవారం వడిసలమ్మను రంగు రంగు పూలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమరాపురం బస్టాండ్ ఆవరణంలో వెలసిన వడిసలమ్మ అమ్మవారికి, గంగభవిని, కొల్లపురమ్మ, కన్యకాపరమేశ్వరి, ములకంటేశ్వరి అమ్మవార్లుకు ప్రత్యేకంగా అలంకరణ, ప్రాకారోత్సవం, విశేష అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు, భక్తుల కొర్కెలు తీర్చే దేవతగా అమ్మవార్లను భక్తులు పూజలు నిర్వహించారు. పట్టణంలోని అనేక మంది భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు, వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

కృష్ణాష్టమి ఆహ్వాన పత్రికల విడుదల



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న సంఘం నాయకులు

సోమందేపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వచ్చేనెల 22న జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను వేణుమాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మంగళవారం విడుదల చేశారు. ప్రతియేటా మాదిరి అంగరంగ వైభవంగా సాంస్కృతిక కార్యక్రమాలు, కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లువారు తెలిపారు. కుల మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు మహేష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సోమందేపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తికుంటపల్లి, తుంగోడు గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిపనులను మంగళవారం ఎంపీడీఓ వెంకటలక్ష్మీ పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కూలీ తమ పనిదినాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోజువారి వేతనం రూ.307పడేలా పనులు చేసుకోవాలన్నారు. పేస్లిప్‌లు అందనివారికి త్వరలో అందిస్తామన్నారు.

కేజీబీవీలో భోజనాల పరిశీలన

మండలకేంద్ర సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో ఎంపీడీఓ వెంకటలక్ష్మీ మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. అనంతరం వంటశాల విద్యార్థులకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. హాస్టల్ వసతి, పరిసరాల పరిశుభ్రతపై ఆరాతీశారు. ఎస్ఓ అనితతో మాట్లాడుతు విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందించాలన్నారు. నీటి ట్యాంకులుఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, కేజీబీవీ సిబ్బంది ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సబ్సిడీతో కంది విత్తనాలు పంపిణీ

రొద్దం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీతో అందించే కంది విత్తనాల పంపిణీని టీడీపీ నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం ప్రారంభించారు. రైతుసేవాకేంద్రం-1లో కంది విత్తనాల పంపణీ చేపట్టారు. ప్రతి రైతుకు ఎకరాకు 3కిలోల చొప్పున కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి రాజేష్ తెలిపారు. అవసరమైన రైతులు ఆయా రైతు సేవాకేంద్రాల్లో పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నారప్ప, చంద్రమౌళి, టీడీపీ నాయకులు టైలర్ అంజనేయులు, నరసింహులు, అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

'తెగుళ్లకు సకాలంలో మందులు పిచికారి చేయాలి'

రొద్దం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నపంట సాగుచేసిన రైతుల పొలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టారు. మంగళవారం రొద్దంలోని రైతు శంకర్ మొక్కజొన్న పొలంలో రైతులకు చీడ, పీడల నివారణపై సూచనలు, సలహాలు అందించారు. పంటకు తెగుళ్లు సోకకుండా సకాలంలో మందులు పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి రాజేష్, రైతులు తిరుపాల్ నాయుడు, సిద్దన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గోరంట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగిరి గ్రామానికి చెందిన రైతు వెంకటరెడ్డి పాముకాటు గురై మంగళవారం అస్వస్థతకు గురయ్యాడు. ఆదినారాయణ కుమారుడైన వెంకటరెడ్డి ఇంటిముందు శుభ్రం చేస్తుండగా పాము ఎడమచేతిపై కాటు వేసింది. వెంటనే గోరంట్ల ఆసుపత్రికి తరలించగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేసి, అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం పంపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడిదగడ్డపల్లికి చెందిన 24 ఏళ్ల యువకుడు విషద్రావకం తాగి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రాలేదని మనస్థాపం చెందిన యువకుడు విషద్రావకం తాగాడు. కుటుంబసభ్యులు గోరంట్ల ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

బంగారు కుటుంబాలకు తూట్లు

తూతూమంత్రంగా పీ-4 గ్రామ సభలు

రొద్దం, జూలై 22(ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలను గుర్తించేందుకు గ్రామసభలను తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం బంగారు కుటుంబాలను గుర్తించేందుకు ఈనెల 15 నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలు నిర్వహించ తలపెట్టింది. కార్యదర్శులు, ఇన్‌చార్జిలుగా మండల స్థాయి అధికారులను నియమించింది. మండలవ్యాప్తంగా 1667 మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. పేదరికం నుంచి గట్టెక్కించేందుకు ఆయా గ్రామాల్లో ఉన్నతమైన కుటుంబాలు బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా గ్రామసభల్లో తీర్మానం చేయాలి. అయితే ఆ విధంగా అమలు కావడంలేదు.



గ్రామసభ జరగని రెడ్డిపల్లి సచివాలయం ఇదే

అధికారుల నిర్లక్ష్యం

బంగారు కుటుంబాలను గుర్తించేందుకు జరగాల్సిన గ్రామసభలు తూతూమంత్రంగా నిర్వహిస్తూ ప్రభుత్వ విధానాలకు తూట్లు పొడుస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తాడంగిపల్లి, ఎం.కొత్తపల్లి, రెడ్డిపల్లి, దొడగట్ట గ్రామ పంచాయతీలలో ఇదివరకు గ్రామసభలు జరపకుండా అధికారులు నిర్లక్ష్యంతో ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ లక్ష్యాలను నీరుగారుస్తూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం 2047నాటికి అట్టడుగు స్థాయిలో ఉన్న బడుగు జీవులను ఉన్నత స్థాయి కుటుంబాల్లా తీర్చిదిద్దడానికి పీ-4ను ప్రవేశపెట్టింది. సీఎం చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని బంగారు కుటుంబాలను తీర్చిదిద్దేందుకు ఉన్నతస్థాయి కుటుంబాలను ప్రోత్సహిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అధికారులు సరైన మార్గదర్శకాలను తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పీ-4 గ్రామసభలు నిర్వహించి బంగారు కుటుంబాలను ఎంపిక చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వం పీ-4 బంగారు కుటుంబాలు గ్రామసభల ద్వారా ఎంపికచేసే కార్యక్రమాన్ని చేపట్టింది. అందుకోసం గ్రామాల్లో మూడు నెలలుగా ఇంటింటికీ వెళ్లి పీ-4 సర్వే నిర్వహించారు. అందులో బంగారు కుటుంబాలు ఎంపిక కోసం ఈనెల 16 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది. గ్రామసభలో చర్చించిన అనంతర బంగారు కుటుంబాలను ఎంపిక చేయాల్సివుంటుంది. కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. గ్రామసభల నిర్వహణ కోసం మండలస్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్స్‌గా నియమించారు. గ్రామసభలు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అన్న పర్యవేక్షణకు ఎంపీడీఓ, తహసీల్దార్‌లను నియమించారు. ప్రభుత్వం అంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నా అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో తూతూమంత్రంగా గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మంగళవారం మండలంలో సీ కోడిగేపల్లి, కల్లుమర్రి, గౌడనహళ్లిలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలకు స్పెషల్ ఆఫీసర్స్ రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శిలే తూతూమంత్రంగా సభలు నిర్వహించి ముగించారు. ఈవిధంగా సభలు జరిగితే ప్రభుత్వ లక్ష్యం నెరవేరేదెట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పెనుకొండలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



మడకశిరలో నిరసన తెలుపుతున్న కార్మికులు

సమస్యలను పరిష్కరించండి

● మున్సిపల్ కార్మికుల డిమాండ్

మడకశిర రూరల్, (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ధ్యేయంగా కూటమి

మడకశిర టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ ముందు మంగళవారం మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసనకు దిగారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పదవీ విరమణ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒకే శాఖలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఒకే రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు వేరువేరుగా ఇవ్వడం వలన ఇంజనీరింగ్ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదన్నారు. అన్ని పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు బాలు, రామాంజినేయులు, యలమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని, అంతవరకూ ఆందోళన కొనసాగిస్తామని నగర పంచాయతీ కార్మికులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్, పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ కన్వీనర్ బాబావలి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ కార్మికులకు సంక్షేమ పథకాలను అందజేయాలన్నారు. సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తిప్పన్న, నరసింహ, ఆనంద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌నాయకులు చిన్నవెంకటేశులు, నరసింహ, వెంకటేశ్, చలపతి, జబ్బార్, సాయి పాల్గొన్నారు.

శాకంబరిగా గోదాదేవి



హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో ఆషాఢమాసం ఆఖరి మంగళవారాన్ని పురస్కరించుకుని గోదాదేవి, రమాదేవి అమ్మవార్లకు శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ఆటోనగర్ భగీరథ సర్కిల్‌లో వెలసిన మారెమ్మదేవి ఆలయ 27వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరించారు. అమ్మవారికి బియ్యం పిండితో చేసిన జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు.

నేటి నుంచి చౌడేశ్వరి ఉత్సవాలు

హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముద్దిరెడ్డిపల్లిలో వెలసిన చౌడేశ్వరి మాత అమ్మవారి జయంతి ఉత్సవం రెండ్రోజులపాటు ఘనంగా జరుగనున్నట్లు ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ, అధ్యక్షులు డీపీ నాగరాజు తెలిపారు. బుధవారం గోధూళి లగ్న ముహూర్తకాలం స్వస్తి వాచనంతో ప్రారంభమై లలిత సహస్ర కుంకుమార్చన జరుగనుంది. బుధవారం అమావాస్య సందర్భంగా చౌడేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కళశార్చన, నవగ్రహ హోమం కార్యక్రమాలు, జయంతి జరుగనున్నాయి. శివబాలయోగి స్వామి ఆశ్రమం నుంచి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించనున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



టీడీపీ నాయకులు, వ్యవసాయాధికారులు

అమరాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపును మంగళవారం ఈఓ నరసింహారావు, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ, ఎస్సీ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్ చేపట్టారు. రూ.3,76,542 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సురేష్, పంచాయతీ కన్వీనర్ తిప్పర్త, రామచంద్రప్ప, కృష్ణమూర్తి, సిద్ధేశ్వర, కుమారస్వామి, శ్రీనివాస్, ఆలయ కమిటీ ధర్మకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు

గుడిబండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మణూరుతండాలో..



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిర రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మణూరుతండాలో మంగళవారం మారెమ్మకు దేవత ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తండావాసులతో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నాగరాజు, జనరల్ కార్యదర్శి మారుతిరెడ్డి, దేవరాజ్ నాయక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే గమ్యాన్ని చేరవచ్చు

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ



మాట్లాడుతున్న త్రివిక్రమ్ వర్మ

హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో చదివితే గమ్యాన్ని చేరుకోవచ్చని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ డాక్టర్ త్రివిక్రమ్‌వర్మ పేర్కొన్నారు. ఆయన తన సోదరుడు మధుసూదన్‌వర్మతో ఆయన పట్టణంలోని చిన్మయ విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ కష్టపడి చదివితే కోరుకున్న స్థానాన్ని సంపాదించవచ్చన్నారు. తాను ఎంబీబీఎస్ పూర్తి చేసి సివిల్స్‌వైపు వెళ్లానన్నారు. ఎలాగైనా ఐపీఎస్ కావాలని లక్ష్యంతో ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. విద్యార్థి ఓ లక్ష్యంతో చదివితే దేన్నైనా సాధించవచ్చన్నారు. మధుసుధన్‌వర్మ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా గురువులు చెప్పిన విధంగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, బీజేపీ ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



విద్యార్థినిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): హిందూపురానికి చెందిన బాలయేసు కళాశాల విద్యార్థిని చంద్రబాను చతుర్వేది కేరళ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సౌరిరెడ్డి తెలిపారు. జూన్ 1న కేరళలోని తిరువనంతపురం రాగవిలాసం ప్యాలెస్‌లో అంతర్జాతీయ శాస్త్రీయ నృత్యకళాపోటీలు జరిగాయి. దీంతో 150 మంది నాట్య కళాకారులు పాల్గొన్నారు. ఇందులో మోహిని అట్టం, కూచిపుడి, భరతనాట్యం, కథక్ నృత్యాలతో అలరించారు. దీంతో చంద్రబాను చతుర్వేదికి కేరళ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. ఇలాంటి అరుదైన రికార్డును సొంతం చేసుకున్న విద్యార్థినిని కళాశాలలో మంగళవారం సత్కరించారు.

ఆటోను ఢీకొన్న కారు.. పలువురికి గాయాలు

లేపాక్షి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుర్లపల్లి గ్రామంవద్ద మంగళవారం ఆటోను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురు మహిళలకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కొండూరు గ్రామానికి చెందిన 15 మంది మహిళలు గార్మెంట్స్‌లో పని ముగించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఆటోలో వెళ్తున్నారు. అదే సమయంలో కొండూరు గ్రామం నుంచి కారు అతివేగంగా లేపాక్షి వైపు వచ్చింది. కుర్లపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను కారు ఢీకొంది. ప్రమాదంలో ఆటో, కారు నుజ్జు నుజ్జు కాగా ఆటోలో ప్రయాణిస్తున్న 15మందిలో ఐదుగురు మహిళలకు తీవ్ర గాయాలు, మిగిలినవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం: సీడీపీఓ

లేపాక్షి, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం సీడీపీఓ సుధ వరలక్ష్మీ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధక కమిటీలు, బాలల హక్కుల పరిరక్షణ తదితరవాటిపై ఆమె అవగాహన కల్పించారు.

మార్కెట్‌యార్డ్ డైరెక్టర్‌గా తిరుపాల్‌నాయుడు



రొద్దం, జూలై 22(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా తిరుపాల్‌నాయుడు ఎంపికయ్యారు. రొద్దం మండలం ఆర్.కొట్టాల గ్రామానికి చెందిన రైతు తిరుపాల్‌నాయుడు టీడీపీ కోసం ఎన్నోఏళ్లుగా సేవలందించారు. ఆయన సేవలను గుర్తించి మంత్రి సవిత తిరుపాల్‌నాయుడును పెనుకొండ మార్కెట్‌యార్డ్ డైరెక్టర్‌గా ఎంపిక చేశారు. ఈ మేరకు ఉత్వర్వులు అందాయి. తనపై నమ్మకముంచి ఈ పదవిని కట్టబెట్టినందుకు మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదరిక నిర్మూలన ముఖ్యమంత్రి లక్ష్యం

నగర పంచాయతీ చైర్మన్



మాట్లాడుతున్న నరసింహరాజు

మడకశిర టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో పేదరికన్ని నిర్మూలించాలన్న లక్ష్యంతో పీ4 కార్యక్రమం చేపట్టారని నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు అన్నారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని 3,4,8వ వార్డులలో పీ4 కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పగడాల జగన్నాథ్‌తో కలిసి సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ4 కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే అన్నారు. విజన్ 2047లో ప్రతి కుటుంబం ఆర్థికంగా పరిపుష్టిగా సమాజంలో సముచిత స్థాయిలో ఉండాలన్న లక్ష్యంతో పీ4 కార్యక్రమం చేపట్టారన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో పూర్తిగా పేదరిక నిర్మూలన కోసం శ్రమిస్తున్నారని, అందులో భాగంగానే అనేక పథకాలు ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. పట్టణంలో ప్రతి పౌరుడు ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ4 కార్యక్రమంలో పాల్గొనాలని, బంగారు కుటుంబ జాబితలోకి అర్హులను చేర్చడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభావతి, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కానివ్వం

మున్సిపల్ చైర్మన్

హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కానివ్వమని మున్సిపల్ చైర్మన్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవరం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కరువు నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని కొంతమంది చెప్పడంపై కథనాలు వచ్చాయి. అయితే గత యేడాది కరువు నిధుల కింద రూ.5.50కోట్లు మంజూరయ్యాయని ఇందులో రూ.80లక్షల నిధులు పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాలకోసం వినియోగించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే ప్రస్తుతం నీటి అవసరాలు లేవని దీంతో రూ.10లక్షలు మాత్రం నీటి కోసం వినియోగించి రూ.70లక్షలు ఇతర అభివృద్ధి కోసం ఉపయోగించుకునేందుకు కలెక్టర్‌కు లేఖ రాయడానికి కౌన్సిల్‌లో కౌన్సిలర్లు చెప్పడానికి మాత్రమే అజెండాలో ఉంచామన్నారు. వాటిని దుర్వినియోగం చేయడానికి కాదన్నారు.

మహిళకు ఫోన్‌లో వేధింపులు

కేసు నమోదు చేసిన పోలీసులు

హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో టీడీపీ కార్యకర్త ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పట్టణంలోని మేళాపురంలో నివాసమున్న ఓ వివాహిత గత ఆరేళ్లుగా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్ విభాగంలో వర్కర్‌గా పనిచేస్తుంది. అయితే ఈమె విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటంతో ఒకటన్నర నెల క్రితం వైద్యుల సూచనమేరకు శానిటేషన్ కాంట్రాక్టర్ ఆమెను తప్పించారు. అయితే కొద్దిరోజుల క్రితం లేపాక్షి మండలం బిసలమానేపల్లికి చెందిన టీడీపీకి చెందిన కగ్గల్లప్ప సదరు మహిళతో ఫోన్‌లో మాట్లాడుతూ నీకు తిరిగి ఉద్యోగం ఇప్పిస్తానని తనకు కమిట్మెంట్ ఇవ్వాలని కోరాడు. ఈ విషయాన్ని ఈనెల 16న సదరు మహిళ ఎమ్మెల్యే పీఏ దృష్టికి తీసుకెళ్లింది. దీంతో వారు వెంటనే కార్యకర్తపై పోలీసులకు చెప్పి కేసు నమోదుచేయించారు. పార్టీ నుంచి కూడా సస్పెండ్ చేశారు. అంతకు ముందు కగ్గాలప్ప ఆ మహిళలో మాట్లాడిన ఆడియోను సోమవారం సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ ఆడియోను వైరల్ చేసింది వైసీపీ నాయకులంటూ టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే వైసీపీ నాయకులు పట్టణానికి చెందిన యుగంధర్‌పై ఆరోపణలు చేశారు. మహిళతో కగ్గాలప్ప ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడారని చెప్పిన వెంటనే మహిళతో తామే ఎమ్మెల్యే పీఏ దృష్టికి తీసుకెళ్లి ఆయనను పోలీసులకు పట్టించామని యుగంధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వైసీపీ నాయకుడు చేసిన అరాచకాలను ప్రశ్నిస్తుంటే వారు తనపై ఆరోపణలు చేస్తున్నారని దీనిపై చట్టపరంగా ముందుకెళ్తానన్నారు.

బేకరీలోకి దూసుకెళ్లిన లారీ

ముగ్గురి మృతి.. పలువురికి గాయాలు




బేకరీలోకి దూసుకెళ్లిన లారీ

పావగడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా కొరటగెరె తాలూకా కోళాల సర్కిల్‌లో ఓ ఎరువుల లారీ అదుపుతప్పి బేకరీలోకి దూసుకుపోయింది. దీంతో ముగ్గురు మృతిచెందారు. మరో నలుగురు గాయపడ్డారు. బాధితులను ఆస్పత్రికి తరలించారు. బేకరీ వద్ద మంగళవారం ఉదయం వినియోగదారులు పలువరు నిలబడి ఉన్నారు. ఇదే సమయంలోనే సర్కిల్ నుంచి వేగంగా వచ్చిన లారీ అదుపు తప్పి బేకరీలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కాటేనహళ్ళికి చెందిన రంగశామయ్య(65), పురదల్లికి చెందిన బైలప్ప(65), మరో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. కాంతరాజు, సిద్ద గంగమ్మ, జయణ్ణ, మోహన్‌కుమార్ గాయపడ్డారు. ఈ ప్రమాదంపై స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి పరమేశ్వర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కోళాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంలో బేకరీ పూర్తిగా ధ్వంసమైంది.

'తొలి అడుగు' వందశాతం పూర్తికావాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రజాక్



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రజాక్

హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్లి వందశాతం పూర్తి చేయలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రజాక్ అన్నారు. మంగళవారం హిందూపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 40శాతం మాత్రమే చేశారని వందశాతం పూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, పట్టణ కన్వీనర్ ప్రెస్ వెంకటేశ్, రాము, శ్రీనివాసులు, అభిలాష్, కోఆర్డినేటర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

● పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్‌రజాక్, పట్టణాధ్యక్షులు వెంకటేశ్ పాల్గొన్నారు.

● సోమందేపల్లిలోని దుర్గానగర్‌లో టీడీపీ నాయకులు నాగరాజు, బూత్ కన్వీనర్ నటరాజచారి, కోకన్వీనర్ నారాయణస్వామి, మద్దిలేటి, గట్టా మహేంద్ర, రంగనగోపాల్ ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు.